PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 43 | విజయవాడ, శనివారం 13 సెప్టెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 13 September 2025 | Rs



సిపిఎం పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఆ పార్టీ శ్రేణులు దేశవ్యాప్తంగా ఘనంగా నివాళులర్పించాయి. ఏచూరి తొలి వర్ధంతి సందర్భంగా ఢిల్లీలోని ఎకెజి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి, ప్రకాష్‌కరత్, బృందాకరత్ తదితర నేతలు... ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని ప్రతిన బూనారు.

7

ఉప రాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ 15వ ఉప రాష్ట్రపతిగా సిపి రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం నాడిక్కడ రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాధాకృష్ణన్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జెపి నడ్డా, నితిన్ గడ్కరీ, పీయూష్ గోయెల్, ధర్మేంద్ర ప్రదాన్ సహా పలువురు కేంద్ర మంత్రులు, లోక్‌సభ స్పీకరు ఓంబిర్లా, ఎన్‌డిఎ కూటమి నేతలు, ఎంపిలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు.



ఉప రాష్ట్రపతిగా సిపి రాధాకృష్ణన్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఈ కార్యక్రమానికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉప రాష్ట్రపతులు జగదీప్ ధన్‌ఖర్, వెంకయ్య నాయుడు, హమిద్ అన్సారీ తదితరులు హాజరయ్యారు. రాధాకృష్ణన్ గురువారం మహారాష్ట్ర గవర్నర్ పదవికి రాజీనామా చేయడంతో గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు మహారాష్ట్ర గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

వణికిస్తున్న అతిసార

- మరొకరు మృతి
- రెండుకు చేరిన మృతుల సంఖ్య!

194కు పెరిగిన కేసులు -బాధితులకు ప్రత్యేక వైద్య శిబిరం, జిజిహెచ్‌లో చికిత్స

ప్రజాశక్తి- విజయవాడ

విజయవాడ నగరంలోని న్యూ రాజరాజేశ్వరి పేటలో అతిసార అదుపులోకి రాకపోగా మరింత విజృంభిస్తోంది. శుక్రవారం రాత్రి ఓ యువకుడు వాంతులు, విరోచనాలతో మరణించాడు. అతిసార కేసులు మొత్తం 194కి పెరిగాయి. వీరిలో 106 మంది విజయవాడ కొత్త ప్రభుత్వాస్పత్రి, న్యూ ఆర్‌ఆర్ పేటలోని కేర్ అండ్ షేర్ విఎంసి పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాల్లో చికిత్స పొందుతున్నారు. 88 మంది ఇప్పటికే చికిత్స పొంది డిశ్చార్జి అయ్యారు. గురువారం రాత్రికి 122 కేసులు ఉండగా, కొత్తగా 72 కేసులు నమోదయ్యాయి. న్యూ ఆర్‌ఆర్‌పేట మసీదు సమీపంలో నివాసం ఉంటున్న జి.నరసింహారావు (37) అనే వ్యక్తి అతిసారతో మృతి చెందారు. ఆయన రెండు రోజుల క్రితం నుంచి వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించడంతో వైద్యులు సిపిఆర్ నిర్వహించారు. మెరుగైన వైద్య చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నరసింహకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బ్యానర్లు, కటౌట్లు నిర్మాణ పనులు చేసుకుంటూ ఆయన జీవనం సాగిస్తున్నాడని బంధువులు తెలిపారు. ఈ నెల 9వ తేదీ రాత్రి అదే ప్రాంతానికి చెందిన శ్రీరామ నాగమణి (61) అనే మహిళ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. అతిసార వల్లే ఆమె మృతి చెందినట్లు కుటుంబసభ్యులు, స్థానికులు చెప్తున్నారు. అధికారులు మాత్రం ఆమె మృతికీ, అతిసారకూ సంబంధంలేదని అంటున్నారు. న్యూ ఆర్‌ఆర్ పేటలో అతిసార బాధితులు పెరుగుతుండడంతో ప్రత్యేక వైద్య బృందాలు చికిత్స అందిస్తున్నాయి. వాంతులు, విరోచనాలతోపాటు తలనొప్పి, జ్వరం, కాళ్ళ పీక్కుపోవడం, ఒళ్లు నొప్పులు, నీరసం తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ప్రత్యేక వైద్య శిబిరానికి పెద్ద సంఖ్యలో వస్తున్నారు. బాధితుల్లో కొంతమందిని కేర్ అండ్ షేర్ పాఠశాల శిబిరం నుండి మెరుగైన వైద్యం నిమిత్తం అంబులెన్స్‌ల్లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మరికొంతమంది నేరుగా ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రతి ఇంట్లో ఇద్దరు, ముగ్గురు బాధితులు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆర్‌ఆర్‌పేటలో కుళాయిల ద్వారా తాగు నీటి సరఫరాను ముందు జాగ్రత్త చర్యగా నిలిపివేశారు. ట్యాంకర్ల ద్వారా తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. మినరల్ వాటర్‌ను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. వీధుల్లో బ్లీచింగ్ పిచికారీ చేస్తున్నారు. ప్రత్యేకంగా పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేసి పరిస్థితి మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నారు. న్యూ ఆర్‌ఆర్‌పేట పరిసర ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ వైద్య ఆరోగ్యశాఖ, విజయవాడ నగర పాలక సంస్థ ప్రజారోగ్య విభాగం సిబ్బంది తిరుగుతూ ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారు. బాధితులను గుర్తించి వైద్య శిబిరానికి తరలిస్తున్నారు. తాగునీటి నమూనాలు సేకరించారు. అతిసార ప్రబలడానికి కారణాలను తెలుసుకునేందుకు బ్యాక్టీరియల్‌తోపాటు వైరల్, ఫంగల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఒకసారి తాగునీటి నమూనాలను పరీక్షించారు. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయిలో సిబ్బందితో మిగతా 7లో



విజయవాడ న్యూఆర్‌ఆర్ పేట ప్రత్యేక వైద్య శిబిరంలో బాధితులను పరామర్శిస్తున్న మంత్రి పి.నారాయణ

ఆంధ్రాలోనే 34 శాతం మంది వారసులే

- దేశంలో కాంగ్రెస్, బిజెపిల్లో అత్యధికం
- చట్ట సభల సభ్యులపై ఎడిఆర్, ఎన్‌ఇడబ్ల్యూ నివేదిక

7

'అంగన్‌వాడీ' రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

- 20, 21 తేదీల్లో ఒంగోలులో నిర్వహణ
- వాల్ పోస్టర్ ఆవిష్కరణ

2

శోభాయాత్రపైకి దూసుకెళ్లిన ట్రక్కు

- 8 మంది మృతి
- 22 మందికి తీవ్రగాయాలు



హసన్ : కర్ణాటకలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. హసన్ జిల్లా హోళానరసీపుర తాలూకా మొసళె హోసన్‌హళ్లిలో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకువెళుతున్న శోభాయాత్రపైకి ట్రక్కు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎనిమిదిమంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, 22 మందికి తీవ్రంగా గాయపడ్డారు. బాధితులంతా యువకులేనని స్థానికులు తెలిపారు.

స్థానికుల కథనం ప్రకారం.. హసన నుంచి హోళా నరసీపురానికి వస్తున్న ట్రక్కుకు ఎదురుగా ఒక ద్విచక్ర వాహనం వచ్చింది. దానిని తప్పించే క్రమంలో డ్రైవర్ ట్రక్కుపై నియంత్రణ కోల్పోయాడు. ఊరేగింపుగా వస్తున్న వారిపైకి వాహనం దూసుకెళ్లింది. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని సహాయక కార్యక్రమాలు ప్రారంభించారు.


క్షతగాత్రులను హసన్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ప్రమాదం పట్ల ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి పూర్తిస్థాయిలో వైద్యసేవలు ఉచితంగా అందించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఆక్వా సంక్షోభాన్ని నివారించండి

- కేంద్రాన్ని కోరిన సిఎం చంద్రబాబు
- వెల్లడించిన రాష్ట్ర మత్స్యశాఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమెరికా ప్రభుత్వం రొయ్యల ఎగుమతులపై సుంకాలను 50 శాతం పెంచిన నేపథ్యంలో ఆ రంగం ఎదుర్కుంటున్న సంక్షోభాన్ని నివారించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు పలు అంశాలను ఆయన కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయినట్లు ఆ శాఖ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకటనలో పేర్కొన్న వివరాల ప్రకారం మత్స్య మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (ఎఫ్ఐడిఎఫ్)తో ప్రాసెసింగ్ ప్యాకేజింగ్, శీతల గిడ్డంగుల ఆధునీకరణ, దేశీయ జాతులైన వ్యాధి రహిత టైగర్ రొయ్యలు, ఇండికస్ రొయ్యల సాగును ప్రోత్సహించాలని, జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు (ఎన్ఎఫ్‌డిబి) ఆధ్వర్యంలో రూ.100 కోట్ల నిధితో ఎపి రొయ్యల ఉత్పత్తిదారుల సంస్థను ఏర్పాటు చేయాలని సిఎం కేంద్రాన్ని కోరారు.,రాష్ట్రంలో ఐసిఎఆర్ / ఎన్ఎఫ్‌డిబి ప్రాంతీయ కార్యాలయాన్ని స్థాపించాలని విజ్ఞప్తి చేశారు. రుణాలపై వడ్డీ చెల్లింపులకు 240 రోజుల మారిటోరియం, రుణాలపై రెండు ఏళ్లకు 5 శాతం వడ్డీ సబ్సిడీ, శీతలీకరించిన సముద్ర ఆహారంపై 5 శాతం జిఎస్టి తాత్కాలిక మినహాయింపు కల్పించాలని ఆర్థిక మంత్రిత్వ శాఖను కోరారు. అమెరికాతో సుంకాల సడలింపుల కోసం ద్వైపాక్షిక చర్చలు, యూరప్, దక్షిణ కొరియా, సౌదీ అరేబియా, రష్యా మార్కెట్లలో విస్తరణ, ప్రాధాన్య వాణిజ్య ఒప్పందాలతో పోటీ సామర్థ్యం పెంచాలని వాణిజ్య, విదేశాంగ మంత్రిత్వ శాఖలను ముఖ్యమంత్రి కోరారు.




సమాంతరంగా అభివృద్ధి, సంక్షేమం

- వృద్ధి రేటు పెరుగుదలకు ప్రణాళికలు
- మంగళగిరిలో వే2న్యూస్ కాంక్లేవ్‌లో సిఎం చంద్రబాబు

3

టమోటా ధర పతనం

- పత్తికొండ, ప్యాపిలి మార్కెట్లలో కిలో రూ.6కు మాత్రమే కొనుగోలు



2

లాసెట్ రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

లాసెట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్‌ను ఈ నెల 14 వరకు ఉన్నత విద్యామండలి పొడిగించింది. విద్యార్థుల కోరిక మేరకు పొడిగించామని ఉన్నత విద్యామండలి కార్యదర్శి టివి కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ నెల 14 వరకు అభ్యర్థులు రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లించే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. 15వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన, 17వ తేదీ ఆప్షన్ల ఎంపిక ఉంటుందని తెలిపారు. 18న ఆప్షన్లు మార్చుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. 20న సీట్లు కేటాయిస్తామని తెలిపారు. 22 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, అభ్యర్థులు 24వ తేదీ వరకు కళాశాలల్లో రిపోర్టు చేయాలని వెల్లడించారు.

విశాఖ ఉక్కు పరిరక్షణకు రాష్ట్రవ్యాప్త పోరాటం

- రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రతిపక్షపార్టీల పిలుపు
- 15న కార్యక్రమాల ప్రకటన
- పరిరక్షణకు సిఎం బాధ్యతలు స్వీకరించాలని డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ ఉక్కు పరిరక్షణే లక్ష్యంగా పోరాట శంఖారావం పూరించడానికి సిద్దం కావాలని రాష్ట్ర ప్రజానీకానికి ప్రతిపక్షాలు,పలు ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. విజయవాడలోని ఎంబివికెలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రతిపక్షాల నేతలతో పాటు, పలు ప్రజాసంఘాల నాయకులు హాజరైన సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. 30వ తేది ప్రజాసంఘాల సమావేశం నిర్వహించడంతో పాటు విద్యార్థి ఉద్యమం నిర్వహించడం, విజయవాడ ధర్నాచౌక్‌లో మహా ధర్నా జరపడం, అన్ని జిల్లాల్లో పరిరక్షణ సదస్సులు నిర్వహించడంతో పాటు, ఇచ్ఛాపురం నుండి హిందూపురం వరకు బస్సు యాత్ర చేయడం, కోటి సంతకాలను సేకరించడం, అప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే రాష్ట్ర బంద్‌ను నిర్వహించడం వంటి పలు అంశాలను ఈ సమావేశంలో చర్చించారు. వీటిపై మరింతగా చర్చించి ఈ నెల 15వ తేది కార్యక్రమాలను ప్రకటించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు ముఖ్యమంత్రి స్వయంగా బాధ్యతలు తీసుకోవాలని, ఈ మేరకు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరాట కమిటీకి రాసిన లేఖకు కట్టుబడి ఉండాలని ఈ సమావేశం డిమాండ్ చేసింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నరసింగరావు అధ్యక్షత వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 2021 నుంచి సాగుతున్న విశాఖ ఉక్కు పోరాటానికి ప్రస్తుతం టిడిపి, జనసేన పార్టీలు వెన్నుపోటు మిగతా 7లో



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

మళ్లీ తెరపైకి నేవీ ఆయుధ డిపో

- అధికారులతో కలెక్టరేట్‌లో ఎంపి చర్చలు
- ఏడాదిలో పనులు ప్రారంభిస్తామని వెల్లడి
- గిరిజనుల్లో తీవ్ర కలవరం



నేవీ, ఇతర అధికారులతో సమావేశమైన ఎంపి పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతమైన జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు మళ్లీ ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. దీంతో, గిరిజనుల్లో మరోసారి కలవరం రేపింది. మళ్లీ పోరాటానికి సిద్ధం అవుతున్నారు. నేవీ ఆయుధ డిపో ఏర్పాటును వ్యతిరేకిస్తూ వైసిపి ప్రభుత్వ హయాంలో రెండుసార్లు, టిడిపి కూటమి ప్రభుత్వం హయాంలో ఒకసారి మొత్తం మూడుసార్లు గ్రామసభల్లో గిరిజనులు తీర్మానించారు. అయినా, ప్రభుత్వం ముందుకే సాగుతుండడం పట్ల వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు శుక్రవారం హఠాత్తుగా ఎంపి పుట్టా మహేష్‌కుమార్ కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా జాయింట్ కలెక్టర్, నేవీ అధికారులు హాజరైన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయుధ డిపో ఏర్పాటు చేస్తామని, దీనివల్ల ప్రజలకు ఎంతగానో మేలు చేస్తుందని మళ్లీ పాతపాటే పాటారు. స్థానిక ప్రజల అభిప్రాయాన్ని గౌరవిస్తు న్నామని, ఆయుధ డిపోపై వెనక్కి తగ్గుతున్నామని కొద్దికాలం క్రితం ఆయన ప్రకటించడంతో అంతా సద్దుమణిగిందని గిరిజనులు అనుకున్నారు.

మూడేళ్లగా పోరాటం

జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం పంచాయతీ దాట్లవారి గూడెం, వంకావారిగూడెం, మడకంవారిగూడెం, రమణక్కపేట, కొత్తసీమలవారి గూడెం మొత్తం ఐదు గ్రామాల పరిధిలో నేవీ ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటుకు 2023లో వైసిపి ప్రభుత్వంలో ప్రయత్నించింది. మొత్తం 1,166 ఎకరాలు అవసరమంటూ నేవీ అధికారుల నుంచి ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచాయి. అధికారులు సర్వేలు సైతం నిర్వహించారు. ఈ సర్వేలను గిరిజనులు అడ్డుకున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఏ పని చేపట్టాలన్నా గ్రామసభ అనుమతి తప్పనిసరి. దీంతో, వైసిపి హయాంలో రెండుసార్లు గ్రామసభలు నిర్వహించగా, నేవీ ఆయుధ డిపోకు వ్యతిరేకంగా తీర్మానాలు చేశారు. అంతేకాకుండా రోడ్డెక్కి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగే స్పందన కార్యక్రమంలో అధికారులకు వినతులు అందించారు. దీంతో, వైసిపి ప్రభుత్వం వెనక్కి తగ్గింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక నేవీ ఆయుధ డిపోపై ముందుకు సాగేందుకు మిగతా 7లో

నేడు మణిపూర్‌లో మోడీ పర్యటన

ఇంఫాల్ : రెండేళ్లకుపైగా హింసాకాండతో రగులుతున్న మణిపూర్‌లో ఎట్టకేలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ పర్యటించనున్నారు. శనివారం మణిపూర్‌కు రానున్న మోడీ ఇంఫాల్, చురాచంద్‌పూర్‌లో పునరావాస శిబిరాల్లో తలదాచుకుంటున్న నిరాశ్రయులను పరామర్శించనున్నారు. రూ.8,500 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించనున్నారని మణిపూర్ చీఫ్ సెక్రటరీ పునీత్ కుమార్ గోయెల్ శుక్రవారం తెలిపారు. చురాచంద్‌పూర్‌లోని పీస్ గ్రౌండ్ నుంచి రూ.7,300 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు మోడీ శంకుస్థాపన చేస్తారని, రాష్ట్ర రాజధాని ఇంఫాల్ నుంచి రూ.1,200 కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కూడా ప్రారంభిస్తారని తెలిపారు. మోడీ పర్యటన సందర్భంగా భారీ ఎత్తున భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మణిపూర్‌లో నరమేధాన్ని, మహిళలపై అకృత్యాలను అడ్డుకునేందుకు ఎటువంటి చర్యలు తీసుకోకపోగా, ఇన్నేళ్ల పాటు మొఖం చాటేసిన మోడీ తీరును నిరసిస్తూ 'గో బ్యాక్ మోడీ – ఓ కసాయి' పేరిట రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలపనున్నట్లు ప్రముఖ మహిళా సంఘాలు ప్రకటించాయి.



ప్రమాణస్వీకారం చేస్తున్న సుశీలా కర్కి

నేపాల్ కొత్త ప్రధానిగా సుశీలా కర్కి

- పార్లమెంట్ రద్దుకు ఒప్పందం
- 51కి పెరిగిన మృతులు
- రాజ్యాంగ పరిధిలోనే పరిష్కారం : పార్లమెంట్ నేతల పట్టు

ఖాట్మాండు : నేపాల్ కొత్త ప్రధానిగా సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ సుశీలా కర్కి ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం రాత్రి 8.45 గంటలకు ఆమె ప్రమాణ స్వీకారం చేసినట్లు అధ్యక్ష కార్యాలయం సమాచార శాఖ అధికారి అర్చనా ఖడ్కా ధ్రువీకరించారు. దేశ తొలి మహిళా చీఫ్ జస్టిస్‌గా రికార్డు సృష్టించిన సుశీలా కర్కి ఇప్పుడు దేశ తొలి మహిళా ప్రధానిగాకూడా చరిత్ర సృష్టించనున్నారు. సోషల్ మీడియాపై నిషేధంతో వెల్లువెత్తిన నిరసన ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలుగా రూపుదిద్దుకుని, హింసాత్మకంగా మారడంతో కెపి శర్మ ఓలి ప్రభుత్వం రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో దేశంలో గత కొన్ని రోజులుగా నెలకొన్న రాజకీయ అనిశ్చితికి ముగింపు పలుకుతూ శుక్రవారం కొత్త ప్రధాని నియమితులయ్యారు. ఆందోళన చేసిన జనరేషన్ జడ్ నాయకులు, నేపాల్ ఆర్మీ, అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడల్ మధ్య సుదీర్ఘంగా చర్చలు సాగిన అనంతరం ఈ మేరకు ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా పార్లమెంట్‌ను రద్దు చేస్తారు.

ఎవరీ సుశీలా కర్కి?

1952 జూన్ 7న విరాట్‌నగర్‌లో జన్మించిన సుశీలా కర్కి పొలిటికల్ సైన్స్, లాను మిగతా 7లో

చింతమనేనికి ఊరట

ప్రజాశక్తి - దెందులూరు

ఏలూరు జిల్లా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు భీమడోలు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ విధించిన శిక్షను రద్దు చేస్తూ జిల్లా ఒకటో అదనపు, సెషన్స్ న్యాయస్థానం శుక్రవారం తీర్పునిచ్చింది. కేసుకు సంబంధించిన వివరాలు...2011 నవంబర్‌లో దెందులూరులో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను స్టేజీపైకి ఆహ్వానించకుండా ఎన్నికల్లో ఓడిపోయిన కొఠారు రామచంద్రరావును ఆనాటి కాంగ్రెస్ నాయకులు స్టేజీపై కూర్చోబెట్టారు. స్థానిక టిడిపి నాయకులు అభ్యంతరం తెలపడంతో ఇరు గ్రూపుల మధ్య వివాదం, ఘర్షణ చోటు చేసుకుంది. వట్టి వసంత్‌కుమార్‌పై చింతమనేని ప్రభాకర్, ఆయన అనుచరులు దౌర్జన్యానికి, దాడికి పాల్పడ్డారని, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారని కాంగ్రెస్ నాయకులు కేసు పెట్టారు. ఈ కేసులో చింతమనేని ప్రభాకర్‌కు రెండేళ్ల జైలు శిక్ష, మిగతావారిపై కేసును కొట్టివేస్తూ భీమడోలులోని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు అప్పట్లో తీర్పునిచ్చింది. తనకు విధించిన శిక్ష సహేతుకం కాదంటూ జిల్లా కోర్టులో చింతమనేని అప్పీల్ చేశారు. పూర్వపరాలను పరిశీలించిన కోర్టు చింతమనేనికి విధించిన శిక్షను రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. చింతమనేనిపై నమోదైన కేసులన్నీ తప్పుడు కేసులేనని రుజువైందని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్‌యాదవ్ తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

నేడు ఎపిపిఆర్‌ఎ రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఇపిఎస్-95 పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడ బందరు రోడ్డులోని ఎంబివికెలో ఎపిపిఆర్‌ఎ రాష్ట్ర సదస్సు శనివారం నాడు నిర్వహిస్తున్నట్లు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఎపిపిఆర్‌ఎ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌ఎ శాస్త్రి, కె సత్తిరాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, కేరళ ఎఐసిసిపిఎఫ్‌పిఎ వర్కింగ్ ప్రెసిడెంట్ డి మోహనన్, యుటిఎఫ్ అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లుతోపాటు పలు యూనియన్ల రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు.

జనగణనలో కులగణన చేపట్టాలి : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనగణనలో కులగణన చేపట్టాలని, జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపు 143 వెనుకబడిన తరగతులు ఉన్నాయని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు కేటాయించిన స్థానాలు తగ్గించడం వల్ల వేల సంఖ్యలో స్థానిక సంస్థల పదవులను బిసిలు కోల్పోయారన్నారు. జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న విజయవాడలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

యూరియాపై ఆందోళన వద్దు

- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందొద్దని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎరువుల కొరత పేరుతో రైతులను మోసం చేయాలనుకునే డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సహకార సంస్థలు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ వ్యాపారుల వద్ద 82,054 మెట్రిక్ టన్నుల (ఎంటి) యూరియా అందుబాటులో ఉందన్నారు. ఈ నెలాఖరుకు 1,06,412 ఎంటిలు చేరుకుంటుందని పేర్కొన్నారు. కేంద్రం మరో 24,894 ఎంటిలు గురువారం కేటాయించిందని, ఈ నెల 22వ తేదీలోపు విశాఖపట్నం పోర్టుకు చేరుకుంటుందని వెల్లడించారు. ఈ నిల్వలతో కరీఫ్ సీజన్‌కు సరిపడా యూరియా అందరికీ లభిస్తుందని పేర్కొన్నారు.

40 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - పలాస

ఒడిశా నుంచి పశ్చిమ బెంగాల్‌కు తరలిస్తున్న 40 కేజీల గంజాయిని పలాస రైల్వేస్టేషన్‌లో ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను విలేకరులకు ఆర్‌పిఎఫ్ ఎస్‌ఐ ఎం మాల్యాద్రి, పలాస జిఆర్‌పి ఇన్‌స్పెక్టర్ ఎ రవికుమార్ వెల్లడించారు.

సరళీకరణ విధానాలతో పెరుగుతున్న అసమానతలు

- కార్పొరేట్ల దోపిడీ, మతోన్మాద కేంద్రాలుగా నగరాలు
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు
- పట్టణ ప్రజాసమస్యలపై ఉద్యమాలు : వి. శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న బివి రాఘవులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పాలకులు అనుసరిస్తున్న సరళీకరణ విధానాల కారణంగా సమాజంలో అసమానతలు పెరుగుతున్నాయని, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న సిపిఎం పట్టణ ప్రాంత కార్యకర్తల సమావేశంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేట్ల దోపిడీ, మతోన్మాద కేంద్రాలుగా పట్టణాలను, నగరాలను మారుస్తున్నారని చెప్పారు. కార్పొరేట్ బహుళజాతి కంపెనీలు పట్టణాల్లోని ప్రతి నివాసాన్ని తమ దోపిడీ కేంద్రంగా మారుస్తూ ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్నాయన్నారు. అదనపు లాభాల కోసం బడా సంస్థలు, రియల్‌ఎస్టేట్, నిర్మాణ రంగాన్ని సాధనాలుగా మార్చుకున్నారని వివరించారు. సామాన్యులకు మాత్రం గృహ వసతి గగనంగా మారిందని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం గృహ సదుపాయాన్ని కూడా వ్యాపార సరుకుగా మార్చిందన్నారు. మురికివాడలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని చెప్పారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ వంటి సంస్థలు మతోన్మాదాన్ని రెచ్చగొట్టేందుకు పట్టణాలను కేంద్రంగా వాడుకుంటూ విషబీజాలు నాటుతున్నాయని తెలిపారు. ఈ స్థితిలో పట్టణాల్లో ప్రజా సమస్యలపై ఉద్యమాలను ఉధృతం చేయడంతోపాటు మతోన్మాదశక్తులను ఎదుర్కోవాలని, కార్పొరేట్ కంపెనీల దోపిడీకి అట్టుకట్ట వేయాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నేపాల్లో పాలకులపై పెరిగిన అసంతృప్తి యువతలో ఒక్కసారిగా పెల్లుబుకిందని, నిరంకుశ పాలన సాగిస్తున్న మోడీకి ఇదొక హెచ్చరిక కావాలని అన్నారు. యువతను, ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాలను తప్పవని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పట్టణాలను, రాజధాని నిర్మాణాన్ని కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కాకుండా ప్రజాప్రయోజనాల దృష్టిలో అభివృద్ధి చేయాలని అన్నారు. పన్నుల పెంపుపై కాకుండా సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజారోగ్యం క్షీణిస్తోందని చెప్పారు. రాబోయే రోజుల్లో పట్టణ ప్రజల సమస్యలపై సిపిఎం ఉద్యమాలు సాగిస్తుందని తెలిపారు. టిడిపి, జనసేన కూటమితో పాటు ప్రతిపక్షంలో ఉన్న వైసిపి కేంద్రానికి లొంగిపోయి రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేస్తున్నాయని వివరించారు.

మోడీ విధానాలపై జరిగే పోరాటాల్లో పట్టణ ప్రజలు ముఖ్యపాత్ర పోషించాలని కోరారు. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై రెండురోజులపాటు ఈ సమావేశాల్లో చర్చలు జరిగాయి. భవిష్యత్‌లో ఆందోళన, పోరాట కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. మతోన్మాదశక్తులను ఎదుర్కొనేందుకు రాజకీయ, సైద్ధాంతిక, బహుముఖ కృషిని ముమ్మరం చేయడానికి కార్యాచరణ రూపొందించారు. రెండు రోజులపాటు జరిగిన సమావేశానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తదితరులు ప్రసంగించారు. 22 జిల్లాల నుండి 55 నగరాలు, పట్టణాలకు చెందిన కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సైన్సు, ఆర్ట్, హెరిటేజ్ మ్యూజియంగా రుషికొండ రిసార్ట్స్

- ముఖ్యమంత్రికి బివి రాఘవులు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రుషికొండ రిసార్ట్స్‌ను సైన్సు, ఆర్ట్, హెరిటేజ్ మ్యూజియంగా మార్చాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు శుక్రవారం లేఖ రాశారు. విశాఖపట్నంలో రుషికొండ రిసార్ట్స్‌ను ఎలా వినియోగించాలన్న అంశంపై సూచనలు చేసేందుకు ముగ్గురు మంత్రులతో కూడిన కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించిందని, దీనిలో భాగంగా తన సూచనలు తెలుపుతున్నానని, వాటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. దాన్ని అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన సైన్స్, ఆర్ట్ మ్యూజియంగా వినియోగించాలని తెలిపారు. రాష్ట్రంలోని బాలబాలికల మనో విజ్ఞాన వికాసాలకు టూరిజం అభివృద్ధికి ఇటువంటి మ్యూజియం ఉపయోగపడుతుందన్నారు. అన్ని ప్రముఖ నగరాల్లో ప్రసిద్ధిగాంచిన సైన్స్ మ్యూజియాలు ఉన్నాయనే విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు. కొత్త రాష్ట్రానికి అన్ని హంగులూ కలిగిన గొప్ప నగరంగా అమరావతిని నిర్మిస్తామని పలుమార్లు ప్రకటించారని, వాటితోపాటు విద్యా, విజ్ఞాన వినోద సాధనాలుగా సైన్స్ మ్యూజియం, జంతు ప్రదర్శనశాల, బొటానికల్ గార్డెన్ కూడా ముఖ్యమని వివరించారు. ఈ మూడు సౌకర్యాల ఏర్పాటు గురించి కూడా రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలని కోరారు.

ఆయేషా మీరా తల్లిదండ్రులకు సిబిఐ నోటీసులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రెండు దశాబ్దాల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన బి-ఫార్మసీ విద్యార్థి అయేషా మీరా హత్యకేసులో సత్యంబాబుపై బిఎన్‌ఎస్ 376, 302 సెక్షన్లపై సిబిఐ కేసు నమోదు చేసిన సంగతి పాఠకులకు విధితమే. ఈ నేపథ్యంలో ఏమైనా అభ్యంతరాలుంటే తెలిపాలని ఆయేషామీరా తల్లిదండ్రులకు సిబిఐ కోర్టు శుక్రవారం నోటీసులిచ్చింది. ఇందుకు సంబంధించి అభ్యంతరాలు తెలిపేందుకు ఈ నెల 19న విజయవాడ సిబిఐ కోర్టుకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. ఆయేషా మీరా హత్య కేసులో ఇప్పటికే నిర్దోషిగా సత్యంబాబు విడుదలైన సంగతి తెలిసిందే.

టమోటా ధర పతనం

- పత్తికొండ, ప్యాపిలి మార్కెట్లలో కిలో రూ.6కు మాత్రమే కొనుగోలు
- బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.25 నుంచి రూ.30 విక్రయం


పత్తికొండ మార్కెట్‌కు వచ్చిన టమోటా

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

టమోటా రైతుకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. బహిరంగ మార్కెట్లో కిలో రూ.25 నుంచి రూ.30 వరకూ ధర ఉండగా రైతుకు రూ.6 మాత్రమే లభిస్తోంది. దీంతో, వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ, మద్దికెర, తుగ్గలి, క్రిష్ణగిరి వెల్దుర్తి మండలాల్లో రైతులు అధికంగా టమోటా సాగు చేస్తున్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి టమోటా మార్కెట్ తర్వాత కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్‌లోనే టమోటా క్రయవిక్రయాలు అత్యధికంగా సాగుతున్నాయి. పత్తికొండ నుండి తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ఎకరా విస్తీర్ణంలో టమోటా సాగుకు రూ.50 వేల వరకూ ఖర్చవుతోంది. ఒక ఎకరాలో ఏడు కోతల వరకూ పంట వస్తుంది. బాగా పంట పడితే కోతకు వెయ్యి కిలోల వరకూ దిగుబడి వస్తుంది. ఏడు కోతలకు కలిపి ఏడు వేల కిలోల వరకూ దిగుబడి వచ్చినా కిలో రూ.6 లెక్కన రైతుకు రూ.42 వేలు మాత్రమే దక్కుతుంది. ప్రస్తుత ధరను బట్టి రూ.8 వేల వరకూ నష్టం వస్తోంది. కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్లో కిలో రూ.20 వరకూ ధర ఉంది. ఇతర జిల్లాల్లో రూ.25 నుంచి రూ.30 వరకూ అమ్ముతున్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లిలో శుక్రవారం గ్రేడ్-1 టమాటాకు గరిష్ట ధర రూ.210, కనిష్ట ధర రూ.170 వరకూ పలికింది. గ్రేడ్-2 టమాటాకు గరిష్ట ధర రూ.160, కనిష్ట ధర వంద రూపాయలు లభించింది. పత్తికొండ మార్కెట్లో నలుగురు వ్యాపారులు ఉన్నారు. వీరు సిండికేటై ధర తగ్గించేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషిస్తోందని విమర్శిస్తున్నారు. నంద్యాల జిల్లా ప్యాపిలి టమోటా మార్కెట్‌లోనూ రైతుకు ధర దక్కడం లేదు. ఇక్కడ కూడా శుక్రవారం 25 కిలోల బాక్స్ రూ.150 మాత్రమే లభించింది. ఈ లెక్కన కిలో రూ.6 మాత్రమే పలికింది. రైతులు నష్టపోతుండగా, వ్యాపారులు లాభాలు ఆర్జిస్తున్నారు. వర్షాలు వచ్చినప్పుడల్లా టమోటా ధర పతనమవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని గిట్టుబాటు కల్పించాలని కోరుతున్నారు.

రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటాం

వర్షాల వల్ల టమోటా దెబ్బతింటోంది. కాయ దెబ్బతినడం వల్ల ధరలు తగ్గుతున్నాయి. వర్షాలు తగ్గిన వెంటనే మంచి ధర వస్తుంది. ఉన్నతాధికారులకు నివేదిస్తాం. రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటాం.

- కార్నాలిస్, పత్తికొండ మార్కెట్ కార్యదర్శి


ఎపిటిడిసి సమావేశంలో మాట్లాడుతున్న దుర్గేష్

తిరుపతి కేంద్రంగా పర్యాటకాభివృద్ధి

- మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్రంలో తిరుపతి కేంద్రంగా పర్యాటక అభివృద్ధి (టూరిజం యాంకరింగ్ హబ్) కోసం కృషి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శుక్రవారం స్థానిక తాజ్ హోటల్‌లో ఆయన అధ్యక్షతన రీజనల్ టూరిజం ఇన్వెస్టర్స్ సమ్మిట్ జరిగింది. నూతన పర్యాటక విధానం 2024-29, పర్యాటక ప్రాజెక్టులకు భూ కేటాయింపులు తదితర అంశాలను ఆయన వివరించారు. కొత్త పెట్టుబడుల ప్రతిపాదన, తిరుపతిని సమావేశాలు, ప్రోత్సాహకాలు, ప్రదర్శనలు (మైస్) గమ్యస్థానంగా ప్రోత్సహించడం, కారవాన్ టూరిజం, వివిధ రకాల టూర్ ప్యాకేజీల అనుసంధానం తదితర అంశాలపై పర్యాటక శాఖ ఉన్నతాధికారులు అజయ్‌జైన్, ఆమ్రపాలి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇన్వెస్టర్లతో, హోమ్ స్టే ఆపరేటర్స్‌తో మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేకంగా చర్చలు జరిపారు. ఏడాది కాలంలోనే దాదాపు రూ.12 వేల కోట్లు పర్యాటక పెట్టుబడులు సాధించామని తెలిపారు. రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు, పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు కలిసి రావాలని పెట్టుబడిదారులను మంత్రి కోరారు.

వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం

- 2 రోజులపాటు భారీ వర్షాలు
- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరం వెంబడి పశ్చిమ మధ్య ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్‌జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న 48 గంటల్లో దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర, దక్షిణ ఛత్తీస్‌గడ్ మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని తెలిపారు. ఛత్తీస్‌గడ్, విదర్భ మీదుగా దక్షిణ మహారాష్ట్ర వరకు అల్పపీడన ద్రోణి కొనసాగుతుందన్నారు. అల్పపీడన ద్రోణి ప్రభావంతో రానున్న రెండు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. తీరం వెంబడి 40 నుంచి 60 కిలోమీటర్లు వేగంతో ఈదురుగాలులు వీచే వీలుందన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నెల 13న ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నెల 14న కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.

నవగాంలో 73 మిల్లీమీటర్ల వర్షపాతం

శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి మన్యం జిల్లా నవగాంలో 73 మిల్లీమీటర్లు, విజయనగరం జిల్లా పాత కొప్పెర్లలో 68, మన్యం జిల్లా సీతంపేటలో 59.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని ప్రఖర్‌జైన్ తెలిపారు.

ఆర్థికంగా ఆదుకోవాలి

- గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం కోరింది. పశుసంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్‌ను ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గంటా శ్రీరామ్, పూసపాటి వెంకట్రావు, పశ్చిమగోదావరి గొర్రెల పెంపకందార్ల సహకార యూనియన్ ఛైర్మన్ ఎవి కృష్ణరావు సచివాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. బిసి కార్పొరేషన్ సబ్సిడీతో రాష్ట్ర ప్రభుత్వం గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార ఫెడరేషన్ రుణంతో జాయింట్‌గా రూ.2.20 లక్షలతో రుణాలివ్వాలని కోరారు. ఎన్‌సిడిసి రుణాలు రూ.250 కోట్లలో రెండో విడత కింద రూ.88 కోట్లు వెంటనే విడుదల చేసి ఖర్చు చేయాలని తెలిపారు. మూడో విడత రూ.120 కోట్లు నిధులిచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రూ.10 వేలకోట్లు కేటాయించి ప్రతి పెంపకందారునికి 50 శాతం సబ్సిడీతో రూ.5 లక్షలు చొప్పున రుణం ఇవ్వాలన్నారు. అన్ని జీవాలకు అవసరమైన మందులను ఇస్తూ ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు.



కదిరిలో నిర్వహించిన వర్ధంతి సభలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ఏచూరి స్ఫూర్తితో ప్రజా పోరాటాలు

- రాష్ట్ర వ్యాప్తంగా వర్ధంతి సభల్లో వక్తలు

ప్రజాశక్తి- యంత్రాంగం

ప్రపంచవ్యాప్తంగా మితవాద శక్తుల ప్రాబల్యం పెరగుతున్న నేపథ్యంలో వాటిని ఎదుర్కొనేందుకు సీతారాం ఏచూరి స్ఫూర్తితో ప్రజా పోరాటాలను సాగించాలని ఆయన వర్ధంతి సభలు పలువురు నేతలు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం, సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఏచూరి వర్ధంతి సభలను నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్మిక, కర్షక రంగాల హక్కుల సాధనతోపాటు లౌకిక పరిరక్షణ ఉద్యమాల్లో తుది శ్వాస వరకూ ఏచూరి పోరాడారని కొనియాడారు.

విజయవాడలో నిర్వహించిన వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ విధించిన అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం విద్యార్థి దశలోనే సీతారాం ఏచూరి ఉద్యమించారని తెలిపారు. దేశంలో ప్రబలుతున్న మతోన్మాద శక్తులు, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా లౌకిక వాదులు, మేధావులు, ప్రజాస్వామ్య శక్తులను ఏకం చేసి దేశ ఐక్యత కోసం అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజలు కోసం జీవితం అంకితం చేసిన గొప్ప వ్యక్తి సీతారాం ఏచూరి అని, ఆయన ఆశయాలను కొనసాగిద్దామన్నారు. శ్రీకాకుళంలో నిర్వహించిన ఏచూరి వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా 'వర్తమాన పరిస్థితులు - సిపిఎం వైఖరి' అనే అంశంపై నిర్వహించిన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ మాట్లాడుతూ...ట్రంప్ వాణిజ్య యుద్ధం మొదలుపెట్టిన తర్వాత రాష్ట్రంలో ఆక్వా రంగం కుదుపునకు లోనయిందన్నారు. అమెరికా వద్దంటున్నా రష్యా దగ్గర నుంచి చమురు కొనుగోలు చేయడం వెనుక దేశ ఆర్థిక వ్యవస్థపై భారం తగ్గడంతో పాటు అంబాని, ఇతర రిఫైనరీ సంస్థలకు మేలు కలిగించే అంశమూ ఇందులో దాగుందన్నారు. దేశంలో అప్రకటిత ఏమర్జెనీ నడుస్తోందని, ఎన్నికల్లో తన రాజకీయ శత్రువులను ఓడించేందుకు బిజెపి కుట్ర పన్నుతోందని వివరించారు. 130వ రాజ్యాంగ సవరణ న్యాయ శాస్త్రంలోని మౌలిక విధానానికి విరుద్ధమన్నారు. అనంతరం సీతారాం ఏచూరిపై ప్రజాశక్తి ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు.

గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలో కామ్రేడ్ కొరటాల, బాపనయ్య భవన్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ఏచూరి వర్ధంతి సభ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా సంఘాల నాయకులు ప్రసంగించారు. ముందుగా సీతారాం చిత్రపటానికి రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై కేశవరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... మతోన్మాద ఉపద్రవాన్ని పసిగట్టి, దేశానికి పెనుముప్పు రాబోతుందని ఆనాడే చెప్పిన గొప్ప దార్శనికుడు సీతారాం అని అన్నారు.


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కె.సుబ్బరావమ్మ, కె.ఉమామహేశ్వరరావు తదితరులు

'అంగన్‌వాడీ' రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

- 20, 21 తేదీల్లో ఒంగోలులో నిర్వహణ
- వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

ఈ నెల 20, 21 తేదీల్లో ఒంగోలులో తొలిసారిగా జరగనున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ 11వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. శుక్రవారం ఒంగోలులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఐసిడిఎస్ ఏర్పడి 50 ఏళ్ల పూర్తై స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న తరుణంలోనూ ఆ రంగంలో పనిచేస్తోన్న అంగన్‌వాడీలు, హెల్పర్లు ఉద్యోగ భద్రతకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులపాటు ఒంగోలులోని కాపు కల్యాణ మండపంలో జరిగే మహాసభలో అంగన్‌వాడీల సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ సభకు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎఆర్ సింధు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. రాష్ట్రంలోని 27 జిల్లాలకు చెందిన వెయ్యి మంది నాయకులు పాల్గొంటారని, 21న జరిగే బహిరంగ సభను ప్రజాతంత్రవాదులు ఆర్థిక, హార్దిక సహకారం అందించి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ, సంఘం గౌరవాధ్యక్షులు ఎం.రమేష్ మాట్లాడారు. ఈ సందర్భంగా మహాసభ వాల్ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు.

20న 'ప్రజాశక్తి' కథా, పాటల సంకలనాల ఆవిష్కరణ

- రచనల పోటీ విజేతలకు బహుమతి ప్రదానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మేడే సందర్భాన్ని పురస్కరించుకుని ప్రజాశక్తి సాహితీ సంస్థ నిర్వహించిన రచనల పోటీలో ఎంపికైన కథలు, పాటల సంకలనాల ఆవిష్కరణ సభ ఈనెల 20వ తేదీ ఆదివారం సాయంత్రం విజయవాడలోని బాలోత్సవ భవన్ (రాఘవయ్య పార్క్ ఎదురు సందు)లో జరగనుంది. ఈ సందర్భంగా కథలు, పాటల పోటీ విజేతలకు బహుమతీ ప్రదానం జరుగుతుంది. 'డప్పు' పేరిట ప్రచురించిన కథల సంకలనాన్ని ప్రజాశక్తి దినపత్రిక సంపాదకులు బి.తులసీదాస్, 'మేడే పాటలు' పుస్తకాన్ని ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకులు ఎంవిఎస్ శర్మ ఆవిష్కరిస్తారు. సభకు సాహిత్య ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ అధ్యక్షత వహిస్తారు. కథా సంకలనాన్ని డాక్టర్ ఎం.ప్రగతి, పాటల సంకలనాన్ని దేవేంద్ర పరిచయం చేస్తారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ ఆత్మీయ అతిథులుగా హాజరవుతారు.

ప్రజాశక్తి నిర్వహించిన రచనల పోటీకి 300కు పైగా కథలు, 200 పాటలు వచ్చాయి. అందులోనుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు కథలు, పాటలను ఎంపిక చేసి, ఇప్పటికే ప్రకటించటమైంది. బహుమతి రచనలతో పాటు మరికొన్ని ఉత్తమ రచనలను ఎంపిక చేసి, సంకలనాలను ప్రచురించటం జరిగింది. ఈ సభకు పోటీ విజేతలు, ఇతర రచయితలు, రచయిత్రులు హాజరవుతారు.

మున్సిపల్ స్థలంలో పెద్దారెడ్డి నివాసం !

- ఫిర్యాదుతో మున్సిపల్, రెవెన్యూ అధికారుల కొలతలు

ప్రజాశక్తి -అనంతపురం

మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి తాడిపత్రి భగత్‌సింగ్ కాలనీలో వైసిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి నిర్మాణం చేపట్టారని ఫిర్యాదు రావడంతో డిప్యూటీ జనరల్ ఆఫ్ సర్వేయర్‌తో పాటు మున్సిపల్, రెవెన్యూ అధికారులందరూ సర్వే చేశారు. విషయం తెలుసుకున్న కేతిరెడ్డి పెద్దారెడ్డి తన స్వగ్రామమైన తిమ్మంపల్లి నుంచి తాడిపత్రికి చేరుకున్నారు. సర్వే అధికారులతో ఆయన వాగ్వాదానికి దిగారు. లేఅవుట్‌లో 16 ప్లాట్లు ఉన్నాయని, సర్వే చేసి తనకూ ఓ నివేదిక ఇవ్వాలని అధికారులను కేతిరెడ్డి కోరారు. మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డికి పెద్దారెడ్డికి మధ్య నెలకొన్న వైరం నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

సమాంతరంగా అభివృద్ధి, సంక్షేమం

- వృద్ధి రేటు పెరుగుదలకు ప్రణాళికలు
- మంగళగిరిలో వే2న్యూస్ కాంక్లేవ్‌లో సిఎం చంద్రబాబు


న్యూస్ కాంక్లేవ్ లో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. మంగళగిరిలో శుక్రవారం సాయంత్రం వే2న్యూస్ యాప్ సంస్థ నిర్వహించిన కాంక్లేవ్‌లో సిఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. జర్నలిస్టు కందుల రమేష్ చంద్రబాబుతో ముఖాముఖిగా ఇంటర్వ్యూ చేశారు. చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తూనే ఏ ఏడాదికి ఆ ఏడాది ప్రణాళికలు ఉన్నాయన్నారు. గతేడాది రెండెంకల వృద్ధి రేటు సాధించామన్నారు. విజన్ 2020 డాక్యుమెంట్ సాకారమయ్యాక కూడా విజన్ -2047పై ఇంకా అనుమానాలు సరికాదన్నారు. సూపర్ సిక్స్ ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే అభివృద్ధికి అదే తరహాలో నిధులిస్తున్నామని తెలిపారు. నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో 2029లో మళ్లీ ఎన్‌డిఎ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. 1995 నుంచి 2004 మధ్య అభివృద్ధి అంతా హైదరాబాద్‌కు పరిమితం అయిందన్న విమర్శల నేపథ్యంలో ప్రస్తుతం అమరావతితో పాటు విశాఖ, విజయవాడ, తిరుపతి వంటి నగరాల అభివృద్ధిపై ఫోకస్ పెడుతున్నామన్నారు. సేవల రంగం ద్వారా ఎక్కువ గ్రోత్ సాధించేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు.

అమరావతిలో రాజధాని నిర్మాణ పనులు మూడేళ్లలో పూర్తవుతాయన్నారు. ఆ తరువాత ప్రైవేటు సంస్థల రాక, పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధి ప్రారంభం అవుతుందన్నారు. 2027 చివరి నాటికి పోలవరం పూర్తవుతుందని తెలిపారు. హైదరాబాద్ తరహాలో అమరావతిని మహానగరంగా మారాల్సి ఉందని, అందుకు అనుగుణంగా గుంటూరు-విజయవాడ-తెనాలి-గ్రామాలు కలిస్తేనే మహానగరంగా మారుతుందన్నారు. క్వాంటం వ్యాలీకి శ్రీకారం చుట్టామని, క్వాంటం కంప్యూటింగ్‌కు అవసరమైన అనుబంధ సంస్థలు పెట్టడానికి పలు సంస్థలు ముందుకు వచ్చాయని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ ప్రముఖ విద్యా సంస్థలు కొన్ని ఉన్నాయని, ఇంకొన్ని రాబోతున్నాయని తెలిపారు. ఇందుకోసం మరికొంత భూమి అవసరం అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ 17 మెడికల్ కళాశాలలు కాలేజీలు కట్టకుండా... కట్టేశామని చెబుతున్నారని విమర్శించారు. తాము ప్రైవేట్ వారికి అప్పజెప్పడం లేదని, పిపిపి పద్ధతినే నిర్మాణం చేపడుతున్నామని, ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని, నిర్వహణ ప్రభుత్వానిదేనని సిఎం తెలిపారు.

ఎవరి కోసం థర్మల్ పవర్‌ప్లాంట్?

- బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా 18న కలెక్టరేట్ వద్ద ధర్నా
- వామపక్ష, గిరిజన, ప్రజాసంఘాల నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు, వామపక్ష, గిరిజన, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - బూర్జ, సరుబుజ్జిలి

రాష్ట్ర ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కోసం థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతోందని వామపక్ష, గిరిజన, రైతు, ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నించారు. థర్మల్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో సిపిఎం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ సంఘం అధ్యక్షుడు వాబ యోగి, రైతు కూలీ సంఘం అధ్యక్షులు వంకల మాధవరావు, ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న మాట్లాడారు. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల భూమిని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంటోందని విమర్శించారు. అందులో భాగంగానే శ్రీకాకుళం జిల్లాలో కార్గో ఎయిర్‌పోర్టు, పవర్‌ప్లాంట్ పేర్లతో పెద్దఎత్తున భూములు కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి సిద్ధమవుతోందన్నారు. రైతుల అనుమతులు లేకుండా డ్రోన్ సర్వేలు చేయడం చట్టవ్యతిరేకమన్నారు. రహస్యంగా సర్వే ఎందుకు చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బలవంతంగా భూసేకరణ చేస్తే ప్రజల నుంచి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ఈ నెల 18న కలెక్టరేట్ వద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కె.అప్పలనాయుడు, గిరిజన సంఘ నాయకులు సవర లక్ష్మణరావు, సవర సింహాచలం, సిఐటియు నాయకులు గోపాల్, రామస్వామి, మిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్ నారాయణ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఆర్ మీడియా అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా భాస్కర్ నారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. భాస్కర్ నారాయణ ఇప్పటి వరకు రాష్ట్ర సమాచార కేంద్రంలో సహాయ సంచాలకులుగా విధులు నిర్వహిస్తూ సిఆర్ మీడియా అకాడమీలో డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో సిఆర్ మీడియా అకాడమీ సెక్రటరీ వి మణిరామ్, అకౌంట్ ఆఫీసరు శాంతారామ్, లైబ్రేరియన్ వి శేఖర్, జూనియర్ అసిస్టెంట్ ఎం లోవరాజు, ఆదిత్య పాల్గొన్నారు.


యాత్రికులకు అన్నం వడ్డిస్తున్న నిర్మలా సీతారామన్

శ్రీవారి సేవకుల సేవలు అమోఘం : నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి - తిరుమల : తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో యాత్రికులకు శ్రీవారి సేవకులు అందిస్తోన్న సేవలు అమోఘమని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కొనియాడారు. తిరుమల మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో శుక్రవారం ఆమె అన్నప్రసాదం స్వీకరించారు. గురువారం తిరుమలకు కుటుంబ సమేతంగా చేరుకున్న ఆమె శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసాద కేంద్రం వద్దకు చేరుకుని యాత్రికులకు స్వయంగా అన్నం వడ్డించారు. వారితో కలిసి భోంచేశారు. శ్రీవారి సేవకులతో ముచ్చటించారు. టిటిడి ఫీడ్ బ్యాంక్ పుస్తకంలో తన అభిప్రాయాన్ని లిఖితపూర్వకంగా రాశారు. కేంద్ర మంత్రితో పాటు టిటిడి బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, భానుప్రకాష్‌రెడ్డి, అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్యచౌదరి, డిప్యూటీ ఇఒలు రాజేంద్ర, భాస్కర్, విజిఒ సురేంద్ర పాల్గొన్నారు.

తెనాలిలో డెంగీ... అప్రమత్తమైన అధికారులు

ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు జిల్లా)


యాంటీ లార్వా స్ప్రే చేయిస్తున్న అధికారులు

తెనాలిలో ఒక వ్యక్తికి డెంగీ నిర్ధారణ కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక 17వ వార్డు సాలిపేట ప్రాంతంలో ఓ వ్యక్తి అస్వస్థతకు గురయ్యారు. గుంటూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆయనకు రెండ్రోజుల క్రితం డెంగీ నిర్ధారణ అయినట్లు ఆరోగ్య సిబ్బంది తెలిపారు. దీంతో ఆ ప్రాంతంలోని అలీఖాన్ వీధి, కావేటివారి వీధి, మసీదు ఎదురు సందు ప్రాంతాల్లో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మొవ్వ ఏసుబాబు ఆధ్వర్యంలో మురుగు కాలువలలో పూడిక తీయించి, యాంటీ లార్వా స్ప్రే చేయించారు. బ్లీచింగ్ చల్లించారు. మలేరియా విభాగం సిబ్బందితో ప్రజల్లో అవగాహన కల్పించారు. మురుగునీటి పారుదలకు విఘాతం కలిగించవద్దని, వ్యర్థాలను కాలువల్లో వేయరాదని ప్రజలకు హితవు పలికారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు డి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, జి ప్రసాద్ టివిఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

33 ఏళ్ల తర్వాతే ప్రభుత్వ ఆధీనంలోకి

- మెడికల్ కాలేజీల పిపిపి విధానంపై హోంమంత్రి అనిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మెడికల్ కాలేజీలు పిపిపి విధానంలో 33 ఏళ్ల పాటు ప్రైవేటు సంస్థల వద్దే ఉంటాయని, ఆ తరువాత ప్రభుత్వ ఆధీనంలోకి వస్తాయని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పిపిపి మోడల్‌ను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తప్పుగా చిత్రీకరిస్తూ ప్రజల్లో భయం పుట్టిస్తున్నారని అన్నారు. ఈ విధానంలో యాజమాన్య హక్కులన్నీ ప్రభుత్వానికే ఉంటాయని, నిర్మాణం, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటివి ప్రైవేట్ భాగస్వామ్యంతో జరుగుతాయని పేర్కొన్నారు. 17 కాలేజీలు నిర్మించానని జగన్ అబద్ధాలు అల్లుతున్నారని, వాస్తవానికి శంకుస్థాపన రాళ్లు, బోర్డులే ఉన్నాయని పేర్కొన్నారు. వీటిని సందర్శనకు తనతోపాటు రావాలని సవాల్ విసిరారు. బెంగళూరు నుంచి పార్ట్‌టైమ్‌గా తాడేపల్లికి వచ్చి రాష్ట్రంపై బురద జల్లుతున్నారని విమర్శించారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం ప్రకటించడం పట్ల పామర్రు టిడిపి ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా హర్షం వ్యక్తం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంపై వైసిపి నిరంతరం అసత్య ప్రచారాలు చేస్తోందని బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ విమర్శించారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

ప్రజాశక్తి ఉరవకొండ



అనంతపురం జిల్లా విడపనకల్లు మండల పరిధిలోని హవలిగి గ్రామంలో అప్పుల బాధతో వి లేపాక్షి (39) అనే యువరైతు ఆత్మహత్య చేసుకున్నారు. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు...లేపాక్షి తనకున్న 2.7 ఎకరాల పొలంలో మిర్చి, వరి పంటలు సాగు చేసేవారు. ఐదేళ్లుగా సరైన దిగుబడి రాక, వచ్చినా కనీస మద్దతు ధరలు లేకపోవడంతో సాగు ఖర్చులు కూడా రాలేదు. దీంతో రూ.11 లక్షల వరకు అప్పులు చేశారు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురైన ఆయన శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. రైతు లేపాక్షి కుటుంబాన్ని సిపిఎం, కౌలు రైతు సంఘం నాయకులు రంగారెడ్డి, కృష్ణమూర్తి, వెంకటేశ్ తదితరులు పరామర్శించారు. రూ.25 లక్షల పరిహారం అందజేసి రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

ప్రమాద ఘంటికలు

రాష్ట్రంలోని ప్రజారోగ్య రంగంలో ఇటీవల చోటు చేసుకుంటున్న సంఘటనలు తీవ్ర ఆందోళన కలిగించేలా ఉన్నాయి. గుంటూరు జిల్లా తురకపాలెం గ్రామంలో చోటుచేసుకున్న వరుస మరణాలపై పోస్టు మార్టం జరుగుతుండగానే విజయవాడలోని న్యూ రాజరాజేశ్వరి పేటలో డయేరియా విజృంభించడంతో ఇద్దరు మృతి చెందారు. వందలాది మంది వాంతులు, విరేచనాలతో ఆస్పత్రుల పాలయ్యారు. ఈ ప్రాంతంలో ప్రతి ఇంట్లో ఇద్దరు ముగ్గురు బాధితులు ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. గుంటూరు జిల్లా తురకపాలెంలో చోటుచేసుకున్న వరుస మరణాలపై ఇప్పటికీ పోస్ట్‌మార్టం కొనసాగుతోంది. ఇటీవల చోటుచేసుకున్న ఒక మృతికి బాక్టీరియా కారణంగా వ్యాపించే 'మెలియోయిడోసిస్' వ్యాధి కారణమని తేలింది. ఒక ప్రైవేటు ఆస్పత్రిలో జరిపిన పరీక్షల్లో ఈ మేరకు నిర్ధారణ కావడంతో అధికార యంత్రాంగం ఉలికి పడింది. ఈ నెలలోనే చోటుచేసుకున్న మరో మరణానికి కూడా ఈ వ్యాధే కారణమని భావిస్తున్నారు. దీంతో ఈ గ్రామంలో జులై నుండి ఇప్పటి వరకు చోటుచేసుకున్న 20కి పైగా మరణాలకు కారణాలను వెలికితీసే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఈ మరణాలను విశ్లేషించడానికి ఒక బృందం(డెత్ ఎనాలిసిస్ టీమ్)ను ఏర్పాటు చేశామని, ఆ బృందం నివేదిక వచ్చిన తరువాత పూర్తిస్థాయిలో కారణాలు తెలుస్తాయని అధికారులు అంటున్నారు. తురకపాలెం ఘటనలో యంత్రాంగం వైఫల్యంపై సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సాధారణం కంటే ఎక్కువ సంఖ్యలో కేసులు నమోదవుతున్నా గుర్తించడంలో అధికారులు విఫలమయ్యారని చెప్పారు. క్షేత్రస్థాయి నుండి జిల్లా అధికారుల వరకు ఇదే విధంగా వ్యవహరించడం ప్రజారోగ్య రంగంలో నెలకొన్న స్థబ్దతకు అద్దం పడుతోంది.

విజయవాడలో వ్యాధులు వ్యాపించకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం, రక్షిత మంచినీటిని అందించడంలో అధికారులు విఫలమైనట్లు స్పష్టంగానే కనపడుతోంది. ఈ సంఘటనకు కలుషిత నీరు కారణమని చెబుతున్న స్థానికులు తమకు సరఫరా అవుతున్న రంగుమారిన నీటిని సాక్ష్యంగా చూపిస్తుండగా, అధికారులు ఆ వాదనను తోసిపుచ్చుతున్నారు. ఇతరత్రా కారణాలు చెబుతున్నారు. నిజానికి వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించడం కొత్తేమీ కాదు. తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, సరిగా లేకపోవడంతో పాటు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో విఫలం కావడం ఈ తరహా సంక్షోభాలకు కారణమని గతంలో అనేక సందర్భాల్లో తేలింది. ఆ అనుభవాలనుంచి పాఠాలు నేర్చుకున్న దాఖలాలేవీ కనిపించడం లేదు. వ్యాధులు విజృంభించిన చోట్ల సర్వేలు, రక్తపరీక్షలు, తాగునీటి పరీక్షలు, క్రమబద్ధీకరణ చర్యలలో చోటుచేసుకునే ఆలస్యం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే!

వరుస మరణాల తరువాత తురకపాలెంలో వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించిన పరీక్షల్లో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2,517 మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో 1,026 మందికి కిడ్నీల పనితీరు తగ్గినట్లు, 168 మందికి కాలేయ సంబంధిత సమస్యలున్నట్లు తేలింది. ఇక షుగర్, బిపి వంటి జీవనశైలి వ్యాధుల గురించి చెప్పనవసరం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాలు, గ్రామాల్లో ఈ తరహా పరీక్షలు నిర్వహిస్తే ఫలితాలు ఏ స్థాయిలో ఉంటాయో ఊహించుకోవడానికి భయమేస్తోంది. గతంలోనూ ఉద్దానంలో కిడ్నీ బాధితుల సమస్యలపై రాజకీయ హడావిడి తప్ప ఆచరణలో ఆ సమస్యకు పరిష్కారం లభించలేదు. ఈ పరిస్థితుల్లో పభుత్వ వైద్య ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడం పోయి, ప్రైవేటుకు అప్పగించి చేతులు దులుపుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్న తీరు దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. ఎంతో కొంత ఊరటనిచ్చిన ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రైవేటు బీమా కంపెనీలకు అప్పగించనుండటం, కొత్త మెడికల్ కళాశాలల్లో ప్రైవేటు భాగస్వామ్యానికి పచ్చజెండా ఊపడం వంటి చర్యలు అంతిమంగా ప్రజారోగ్యానికి చేటు కలిగించేవే! ప్రభుత్వ పెద్దలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలి. ప్రభుత్వ వైద్య సదుపాయాలను మెరుగుపర్చడం, రక్షిత తాగునీటిని అందరికీ అందించడం, పారిశుధ్య నిర్వహణను బలోపేతం చేయడం, దోమలను నివారించడం, అవసరమైన సిబ్బంది నియమాకాలు చేపట్టడం, అవగాహన శిబిరాలు నిర్వహించడం వంటి చర్యలపై దృష్టి సారించాలి.

మహనీయుల మాట



ఉడుతను పెంచాను..
పారిపోయింది.
చిలుకను పెంచాను...
పారిపోయింది.
మొక్కను పెంచాను...
పై రెండూ వచ్చి చేరాయి.

- అబ్దుల్ కలాం,
క్షిపణి శాస్త్రవేత్త, పూర్వ రాష్ట్రపతి.

గాజాపై మానవాళి మహా స్పందన

వ్యాఖ్య

చరిత్రతో ముప్పుతిప్పలు పడుతున్నా గొప్ప మార్పును సాధించేందుకు కావలసిన చైతన్యం నింపుకున్న పాలస్తీనా ప్రజలను తేరిపార చూసే సమయమిది. అంతంటూ లేని జాతి విద్వేష మారణహోమం, వినాశనకాండ సాగించే ఒక కృత్రిమ వలస రాజ్యాన్ని విధ్వంసం చేసే సత్తా వారికి వుందని తెలియజెప్పే తరుణం. వెనిస్ చిత్రోత్సవంలో 'వాయిస్ ఆఫ్ హింద్ రజాబ్' చిత్రానికి 23 నిముషాల పాటు సభికులందరూ లేచి నిలబడి కరతాళ ధ్వనులు చేసిన సందర్భం కన్నా ఇందుకు మరో గొప్ప నిదర్శనం వుండదు. ఇది మున్నెన్నడూ ఎరగని ఒక అపూరూప తరుణం.

గాజా ఒక మహోద్రిక్త ఘట్టంలో వుంది. చరిత్రతో ముప్పుతిప్పలు పడుతున్నా గొప్ప మార్పును సాధించేందుకు కావలసిన చైతన్యం నింపుకున్న పాలస్తీనా ప్రజలను తేరిపార చూసే సమయమిది. అంతంటూ లేని జాతి విద్వేష మారణహోమం, వినాశనకాండ సాగించే ఒక కృత్రిమ వలస రాజ్యాన్ని విధ్వంసం చేసే సత్తా వారికి వుందని తెలియజెప్పే తరుణం. వెనిస్ చిత్రోత్సవంలో 'వాయిస్ ఆఫ్ హింద్ రజాబ్' చిత్రానికి 23 నిముషాల పాటు సభికులందరూ లేచి నిలబడి కరతాళ ధ్వనులు చేసిన సందర్భం కన్నా ఇందుకు మరో గొప్ప నిదర్శనం వుండదు. ఇది మున్నెన్నడూ ఎరగని ఒక అపూరూప తరుణం.

ట్యునీషియా దర్శకురాలు కౌతర్ బెన్ హనియా చేసిన ఈ పున:సృజన హింద్ రజాబ్ అనే ఆరేళ్ల పాప కథను కళ్ల ముందుంచుతుంది. 2024 జనవరిలో గాజా నగరంలో ఇజ్రాయిల్ సైనిక మూకలు కారు పేల్చివేసిన దారుణ ఘటనలో తను ప్రాణాలు కోల్పోయింది. ఆమె సోదరులు, బాబాయి, పిన్నితో పాటు కాపాడేందుకు వచ్చిన ఇద్దరు వైద్య సిబ్బంది కూడా బలయ్యారు. రెడ్ క్రెసెంట్ సొసైటీ రికార్డుల ఆధారంగా ఈ డాక్యుమెంటరీ రూపకం తయారైంది. కుటుంబ సభ్యుల మృతదేహాల పక్కనే గాయాలతో పడివున్న రజాబ్ హింద్‌ను కాపాడేందుకు ఆ సొసైటీ గంటల తరబడి ప్రయత్నించింది. 2024 జనవరి 29 నాటి రికార్డింగులో ఆమె రోదన, ఆర్తనాదాలు వినిపిస్తున్నాయి. ఒకవైపున తుపాకులు మోగిపోతుంటే ఆ పాప "దయచేసి ఎవరైనా నా దగ్గరకు వచ్చి కాపాడండి. దయచేసి రండి. నాకు చాలా భయమేస్తుంది..." అని ఆర్తనాదాలు చేయడం కలచివేస్తుంది. సహాయపడటం కోసం ఒక అంబులెన్సు వస్తుంటే ఆపకుండా కాల్పులు సాగిస్తున్న ఇజ్రాయిల్ ట్యాంకులు దాన్నీ చాలా దగ్గర నుంచే ధ్వంసం చేస్తాయి. హింద్ కుటుంబం ప్రయాణిస్తున్న కారును 300 తూటాలు తూట్లు ఛిద్రం చేశాయి. అంబులెన్సును బాగు చేయడానికి రెండు గంటలు కష్టపడాల్సి వచ్చింది.

వారందరి స్వరమిది

ఈ చిత్రంలో నటించిన సాజా కిలానీ పాత్రికేయులతో మాట్లాడారు. "సామూహిక హత్యాకాండ, ఆకలిమంటలు, అమానవీయత, విధ్వంసం, దురాక్రమణ ఇక చాలు." అంటూ ఇంకా ఇలా చెప్పారు..."ఈ చిత్రం ఒక అభిప్రాయమో లేక ఊహాకల్పనో కాదు. ఇది సత్యాన్ని కళ్లకు కట్టే సాధనం. హింద్ కథ మొత్తం ఒక జనావళి బాధను చెబుతుంది. గత రెండేళ్లలోనే గాజాలో చంపబడిన వేలాది మంది పిల్లల గొంతు వినిపించే ఒక కథ. జీవించే హక్కు, కలలు కనే హక్కు, గౌరవంతో మనుగడ సాగించే హక్కు కలిగివున్న ప్రతి చిన్నారి, బాలికా, బాలకుల గొంతుక అది. అయితే ఇవన్నీ మనం కళ్ళప్పగించి చూస్తుండగానే కాలరాచి వేయబడుతున్నాయి".

ఈ చిత్ర నిర్మాణంలో హాలీవుడ్ ప్రముఖులు భాగస్వాములు కావడం గమనించదగింది. ప్రజాభిప్రాయంలో గొప్ప మార్పు ఉప్పొంగి వస్తున్నదని దీనిపై సమీక్షలు చెబుతున్నాయి. "నిర్లక్ష్యం, నిర్దయాత్మకం...ప్రజ్వలింపచేసే ప్రతిభ... నిస్సందేహంగా వెనిస్‌ను రగిలించిన చిత్రం ఏదంటే ఇదే.." అని గార్డియన్ పత్రిక పేర్కొంది. "ఒక మానవీయ అద్భుతం. చిత్రోత్సవంలో అత్యున్నత గౌరవానికి అర్హమిదే" అని 'వోగ్' వ్యాఖ్యానించింది. ఈ చిత్రానికి రజత సింహం అవార్డు రావడం ఈ మొత్తం గాథలో చిన్న భాగమే.



గాజా విషయంలో వాతావరణ మార్పుకు మరో సంకేతం 'సముద్ ఫ్లొటిల్లా'. దిగ్బంధం ఎత్తివేయించే అతి పెద్ద ప్రయత్నం. గాజా సముద్ర మార్గ దిగ్బంధాన్ని సవాలు చేసిన నాలుగో పెద్ద ప్రయత్నం. 44 దేశాలకు చెందిన కార్యకర్తలతో 55 పడవలు ఆహారం, నీళ్లు, మందులు, తీసుకుని బయలుదేరాయి. బార్సిలోనా, ట్యునిస్, సిరియాల నుంచి బయలుదేరిన ఈ నావలు సెప్టెంబరు మధ్యకల్లా గమ్యం చేరవచ్చు. అంతకంతకూ పెరుగుతున్న సౌహార్ధ్రత ఈ రూపంలో వ్యక్తమవుతున్నది. ఫ్లొటిల్లాను గనక అడ్డుకుంటే తాము సముద్ర రవాణా కార్యకలాపాలనే ఆపేస్తామని రేవు కార్మిక సంఘాలు హెచ్చరిక జారీ చేయడం చాలా ప్రముఖమైన పరిణామం.

ఇలా జరగాలని ఎంతగానో ఎదురు చూస్తున్న సందర్భమే ఇది. గాజా విషయంలో వాతావరణ మార్పుకు మరో సంకేతం 'సముద్ ఫ్లొటిల్లా'. దిగ్బంధం ఎత్తివేయించే అతి పెద్ద ప్రయత్నం. గాజా సముద్ర మార్గ దిగ్బంధాన్ని సవాలు చేసిన నాలుగో పెద్ద ప్రయత్నం. 44 దేశాలకు చెందిన కార్యకర్తలతో 55 పడవలు ఆహారం, నీళ్లు, మందులు, తీసుకుని బయలుదేరాయి. బార్సిలోనా, ట్యునిస్, సిరియాల నుంచి బయలుదేరిన ఈ నావలు సెప్టెంబరు మధ్యకల్లా గమ్యం చేరవచ్చు. అంతకంతకూ పెరుగుతున్న సౌహార్ధ్రత ఈ రూపంలో వ్యక్తమవుతున్నది. ఫ్లొటిల్లాను గనక అడ్డుకుంటే తాము సముద్ర రవాణా కార్యకలాపాలనే ఆపేస్తామని రేవు కార్మిక సంఘాలు హెచ్చరిక జారీ చేయడం చాలా ప్రముఖమైన పరిణామం.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో ఈ సంఘీభావ స్ఫూర్తికి ప్రతీకగా మాట్లాడాడు.: 'పాలస్తీనా చచ్చిపోతే దాంతో పాటే మానవాళి చచ్చిపోయినట్టే, మీరు మొదలు పెట్టింది కేవలం సముద్ర యానమే కాదు. ఇదో నైతిక యుద్ధారావం. సముద్రపు గాలులు మీ పడవలను చరిత్ర పవనాలతో పాటు తీసుకెళ్లుగాక. సాగరం రెండు చేతులు చాచి మిమ్మల్ను ఆహ్వానించుగాక. ప్రపంచం మీ సం దేశాన్ని ఆలకించుగాక. మీరు గాజా జలాలను చేరే సమయానికి మీతో పాటు కోట్లాది గొంతులు కలసి వినిపిస్తాయి. శాంతి అనేది కేవలం ఊహ కాదని, బాధ్యతగా సాధించవలసిందనీ గుర్తు చేస్తాయి".

ఎంత వినాశం తర్వాత...?

ఇంతటి తపన, సంఘీభావం హఠాత్తుగా పుట్టుకు రాలేదు. ఇప్పటికి అక్కడ 63,000 మంది బలయ్యారు. 332 మంది ఆహారం లేక అసువులు బాశారు. వారిలో 124 మంది కసిగందులు. 240 మందికి పైగా జర్నలిస్టులు చంపివేయబడ్డారు. జన నష్టం చాలా విపరీతంగా వుందని ప్రకటించడానికి తమరికి మరెంత మంది బలి కావాలి? ఇలాంటిది ఎప్పుడూ జరగొద్దని చెప్పడం ఎప్పటికి మొదలెడతారు?

యూదు జాత్యహంకార రాజ్యం యుద్ధ మారణకాండ ప్రారంభించి రెండేళ్లయింది. భూగోళం చిత్రపటం నుంచి పాలస్తీనాను లేకుండా చేయాలనేదే దాని పన్నాగం. నాటి నుంచి కూడా ఆ మారణహోమం ఇళ్లలో ప్రసారమవుతుంటే చూసి ప్రపంచ వ్యాపితంగా లక్షలాది మంది వీధుల్లోకి వచ్చి నినదిస్తున్నారు. మానవతా సాయం కూడా అందకుండా అడ్డుకుంటున్న ఇజ్రాయిల్ విధానం ఆస్పత్రులపై బాంబుల వర్షం, తిండి కోసం క్యూలో నిలబడ్డ పౌరులను కూడా కాల్చి చంపడం వంటివి వారిని మరింత కల్లోల పరుస్తోంది.

ఈ పరిణామాలకు తోడు వలసదార్లతో కూడిన వలసవాద ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ ఉద్యమం విస్తరించడం, ఒకప్పుడు ఇజ్రాయిల్‌తో నిలబడిన దేశాల పాలకుల స్పందనలో కూడా మార్పు తెస్తున్నది. కనుచూపు మేరలో ఎలాంటి జవాబుదారీ తనం లేని నెతన్యాహూ ప్రభుత్వం అంతకంతకూ దౌత్యపరంగా ఏకాకి అయి పోతున్నది. దానికంటూ విశ్వసనీయత ఏమన్నా మిగిలి వుంటే అదీ పోగొట్టుకుంటున్నది. యూరప్‌లోనే గాక అమెరికాలో కూడా పాలస్తీనా గాజా అన్నవి ప్రధాన సమస్యలుగా ముందుకొచ్చి నిలబడుతున్నాయి.

కీలకమైన సెప్టెంబరు

అందుకే సెప్టెంబరు నెల చాలా కీలకమైన మలుపుగా మారింది. ఐక్యరాజ్యసమితి నిబంధనల ప్రకారం ఒక శాశ్వత సభ్య దేశం వీటోతో భద్రతా మండలికి అడ్డుకట్ట వేస్తే ఐక్యరాజ్యసమితి సాధారణ సమితి (యుఎన్‌జిఎ) చర్య తీసుకోవచ్చు. శాంతి యంత్రాంగం నిబంధన ప్రకారం యుఎన్‌జిఎ పాలస్తీనాకు ఒక శాంతి బలగాన్ని తరలించవచ్చు. ఆ విధంగా పౌరుల రక్షణ కోసం మానవతా సహాయం చేయొచ్చు. యుద్ధ నేరాల సాక్ష్యాలను భద్రపరచి ప్రజలు కోలుకోవడానికి పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టవచ్చు

ఐక్యరాజ్యసమితి సాధారణ సమితిలో అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె) గత ఏడాది ఇజ్రాయిల్‌కు జారీ చేసిన ఉత్తర్వులు, నిర్ధారణలు, వాటిని అమలు చేయకపోతే తీసుకుంటానన్న చర్యల గడువు ముగియబోతుంది. ఈ విషయంలో చేయాల్సిన దానికి ఇది చాలా కీలక సమయం అవుతుంది. నిజానికి ఎప్పుడో జోక్యం చేసుకోవలసిన విషయం. ఇందుకు సంబంధించి తాను పాలస్తీనాను గుర్తిస్తానని ఐరాస సర్వ సభ్య సమావేశంలో బెల్జియం ప్రకటించింది. ఫ్రాన్స్, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా కూడా అదే చెప్పాయి. పశ్చిమ తీరంలోని అక్రమ వలసలలో తయారై వచ్చే అన్ని సరుకుల నిషేధంతో సహా 12 ఆంక్షలు విధిస్తానని కూడా బెల్జియం ఆలోచిస్తున్నది. ఇజ్రాయిల్ కంపెనీలతో ముడిపడిన సరుకుల సేకరణపై సమీక్ష జరుపుతానని అంటోంది.

మారణహోమాలు, మానవ జాతిపై నేరాలు, ఇజ్రాయిల్ యుద్ధ నేరాలను అడ్డుకునేందుకు జెనీవా సదస్సు తీర్మానం పాటించాల్సి వుంటుంది. ఇతర అంతర్జాతీయ చట్టాల ప్రకారం దేశాలు వ్యవహరించడం కూడా జరగాలి. పాలస్తీనా ప్రభుత్వం అలాంటి జోక్యం కోసం విజ్ఞప్తి చేసింది. పాలస్తీనా పౌర సమాజం పదేపదే కోరింది. 1968 నుంచి ఇజ్రాయిల్ పాలస్తీనా భూభాగాలు ఆక్రమించడం, అక్కడ ఆవాసాలు ఏర్పాటు చేయడం అక్రమమని ఐసిజె ఎప్పుడో ప్రకటించింది. గాజాలో మారణహోమాలు జరిగే ముప్పు చాలా వుందని హెచ్చరించింది. ఈ రూలింగ్‌లన్నీ కలిపి చూస్తే అక్కడ అంతర్జాతీయ జోక్యం న్యాయమే కాదు అత్యవసరమని కూడా తెలుస్తుంది.

మోడీ సర్కారు నిర్వాకం

ఈ ఏడాది ఐరాస సమావేశాలకున్న అసాధారణ ప్రాధాన్యత రీత్యా చూస్తే ట్రంప్ ప్రభుత్వం పాలస్తీనా ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొనడానికి అనుమతి నిరాకరించడం దారుణం. నిస్పృహతో కూడిందిగా కనిపిస్తుంది. మరీ ముఖ్యంగా ఇటీవలే జరిగిన బ్రిక్స్, ఎస్.సి.వో శిఖరాగ్ర సమావేశాల నేపథ్యంలో అమెరికా సామ్రాజ్యం అంతకంతకూ ప్రాభవం కోల్పోతున్నది. ఈ సమయంలో ఇలాంటి ఎత్తుగడలు ఇజ్రాయిల్, అమెరికాల విశ్వసనీయతను మరింతగా దెబ్బతీస్తాయి. ప్రజాస్వామ్య యోధులమంటూ తమకు తామే తగిలించుకున్న పాత్ర ప్రపంచానికే పరిహాసప్రాయంగా మారిపోతుంది.

ఈలోగా పచ్చి మితవాద ఇజ్రాయిల్ ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ ఇండియా వచ్చారు. ఆయన చేసిన దారుణ వ్యాఖ్యల కారణంగా అనేక పాశ్చాత్య దేశాలు, ఇ.యు కూడా ఆంక్షలు విధించి తీవ్ర ఖండనలు చేశాయి. ఆయన ఒక ద్వైపాక్షిక ఒప్పందంపై సంతకాలు చేయడానికి ఇండియా వచ్చారు. పశ్చిమ తీరంలో వివాదాస్పద ఇ1 ఆవాసాలను స్మోట్రిచ్ ఇటీవలే పునరుద్ధరించారు. దీనివల్ల పాలస్తీనా దేశం ఏర్పాటు అవకాశం శాశ్వతంగా లేకుండా పోతుందని విమర్శకులు చేస్తున్న హెచ్చరిక. పశ్చిమ తీరంలో 82 శాతం ఆక్రమణతో ఆయన ఇటీవలే ఒక పటం విడుదల చేశాడు. దాంట్లో పాలస్తీనియన్లకు ఏవో కొన్ని కేంద్రాలు మాత్రమే వుంటాయి. బందీల విడుదల కోసం గాజా జనాల కడుపు మాడిస్తే తప్పేంటని సమర్థించేందుకు ఆయన తెగబడ్డాడు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు దిగ్భ్రాంతికరమని ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్, ఇ.యు ఖండించాయి.

పాలస్తీనియన్లపై తియాంజిన్ తీర్మానానికి ఆమోదం చెప్పిన ఇండియా ఈ విధంగా స్మోట్రిక్‌కు స్వాగతం పలకడం ప్రపంచ ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వుంది. ఇజ్రాయిల్‌తో సైనిక భద్రతా సంబంధాలు తెగతెంపులు చేసుకోవాలని భారత ప్రజలు ముక్త కంఠంతో చాటిచెప్పాలి. మారణహోమానికి బలవుతున్న పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెల్పడానికి ద్విగుణీకృత శక్తితో ముందుకు రావాలి. మరెప్పుడూ ఇలా జరగవద్దంటే వద్దని ఢంకా మోగించాలి.

/ సెప్టెంబర్ 9 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం /

లులూ మాల్ వద్దు

సైన్సు పార్క్ కావాలి

విశ్లేషణ

డా॥సి.ఎన్. క్షేత్రపాల్ రెడ్డి

ప్రజల చేత ఎన్నుకోబడిన ఏ ప్రభుత్వమైనా ప్రజల కోసం పని చేయాలి. ప్రభుత్వానికి చెందిన ఆస్తులన్నీ ప్రజలకు చెందినవేనని గుర్తించాలి. ప్రజల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడే ధర్మకర్త పాత్ర ప్రభుత్వానిది. అయితే మన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. ప్రజల కోసం వినియోగించాల్సిన అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ఇష్టానుసారం తమకు అనుకూలమైన ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం నేడు పరిపాటిగా మారింది. ఈ చర్యల్లో భాగంగానే రాష్ట్రంలో అత్యంత కీలకమైన విశాఖనగరంలోని బీచ్ రోడ్డులో ఉన్న 13.74 ఎకరాల భూమిని ప్రజల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా ఏకపక్షంగా లులూ అనే అంతర్జాతీయ కార్పొరేట్ వ్యాపార సంస్థకు ధారాదత్తం చేస్తూ నిర్ణయం తీసుకున్నది. లులూ అనేది ఒక ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్. అబుదాబీ కేంద్రంగా పని చేస్తున్న ఆ సంస్థ వేల కోట్ల వ్యాపారాలు సాగించే ప్రైవేటు సంస్థ. ఆ లులూ సంస్థకు విశాఖ నగరంలోని వాల్తేరు హార్బర్ పార్కు వద్ద ఆర్కే బీచ్ ఎదురుగా సుమారు రూ.3500 కోట్ల విలువైన 13.74 ఎకరాల భూమిని 99 సంవత్సరాల పాటు లీజుకు అంటే (శాశ్వతంగానే అనుకోవాలి) ఇస్తూ ఏపీ పరిశ్రమల శాఖ ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. ఆ జీవో ప్రకారం లులూ సంస్థ మొదటి మూడు సంవత్సరాలు ప్రభుత్వానికి ఎటువంటి లీజు చెల్లించాల్సిన పని లేదు. నిర్మాణం పూర్తయిన తర్వాత నుంచి చదరపు అడుగుకు ఏడాదికి కేవలం రూ.1.50 పైసలు మాత్రమే లీజు చెల్లించేలా నిబంధనలు రూపొందించబడ్డాయి. ఈ లెక్కన ప్రభుత్వానికి సంవత్సరానికి లీజు ద్వారా వచ్చే సొమ్ము కేవలం రూ. 4.51 కోట్లు మాత్రమే. ఇది ప్రజల సొమ్మును అప్పనంగా లులూ కు దోచిపెట్టడమే అవుతుంది.

నిజానికి ప్రభుత్వపు అవసరాలు, ప్రజల అవసరాలకు భూములను వినియోగించుకునేందుకు, అమ్మే హక్కు ప్రభుత్వాలకు ఉంటుంది. అయితే ఆ విషయంలోనూ అనేక నియమ నిబంధనలు ఉన్నాయి. ఎక్కడైనా ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేయాలన్నా లేక విక్రయించాలనుకున్నా ముందుగా టెండర్లను ఆహ్వానించాలి. వేలం వేయడం ద్వారా ప్రభుత్వానికి అధికంగా ఆదాయం కల్పించే వారికి ఆ భూములను అప్పగించవచ్చు. విశాఖ నగరంలో లులూకు కేటాయించిన భూమి విషయంలో ఈ ప్రక్రియకు స్వస్తి పలికారు. 2018 లోనే అప్పటి చంద్రబాబు ప్రభుత్వం లులూ సంస్థకు ఈ భూమిని కేటాయించగా వారు ఎటువంటి



పనులు ప్రారంభించలేదు. తదుపరి వచ్చిన వై.సి.పి ఆ కేటాయింపులను రద్దు చేసింది. ఇందంతా ఒక ఒక ఎత్తయితే లులూకు కేటాయించిన భూమి సముద్ర తీరానికి అత్యంత సమీపంలో ఉంది. సముద్ర తీర ప్రాంతంలో ఏ రకమైన నిర్మాణాలు చేపట్టాలన్నా తీర నియంత్రణ జోన్ (సి.ఆర్.జెడ్) నిబంధనల మేరకు జరగాలి. సి.ఆర్.జెడ్ నిబంధల మేరకు బీచ్‌కు సమీపంలో 500 మీటర్ల వరకూ ఎటువంటి బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టరాదు. సముద్ర మట్టాలు పెరిగే అవకాశం, తీరంలో కోత, వరదలను నివారించే క్రమంలో అక్కడ చేపట్టే నిర్మాణాల విషయంలో అనేక ఇతర నిబంధనలు పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. పర్యావరణం విషయంలోనూ అనేక ఇబ్బందులు తలెత్తుతాయి. చుట్టు పక్కల ఉన్న అనేక నివాస సముదాయాలకు తీవ్రమైన ఇబ్బంది ఎదురవుతుంది. లులూ అతి పెద్ద మాల్ కావడం వలన బీచ్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయి. 2012లో రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ విభాగం జారీ చేసిన భూకేటాయింపుల విధానం ప్రకారం ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలకు యథేచ్ఛగా బదలాయించకూడదు. ఒకవేళ ప్రజా ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశమైతే, భూమిని బదలాయించడం తప్పనిసరి అని తేలితే ఆ భూమికి ఉన్న మార్కెట్ ధర మీద కనీసం 10 శాతం అద్దె లభించేలా ఉండాలి. ఈ అంశాలన్నిటినీ పరిశీలిస్తే విశాఖ సముద్ర తీరానికి, ఆర్.కె బీచ్‌కు అతి సమీపంలో ఉన్న సదరు భూమిని సుమారు రూ.1,086 కోట్ల పెట్టుబడితో నిర్మించే లులూ షాపింగ్ మాల్‌కు కేటాయించడం నిబంధనలకు విరుద్ధం. కూటమి ప్రభుత్వం ఈ నిబంధనలన్నీ సముద్రంలోకి కలిపేసి లులూకు వంత పాడటం నగర ప్రజలను వంచించడమే.

అసలు ఒక ప్రైవేటు వ్యాపార సంస్థకు ప్రభుత్వ భూములను ఎందుకు కట్టబెట్టాలనేది మౌలిక ప్రశ్న. ఇప్పటికే హైదరాబాద్, కొచ్చి సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో లులూ సంస్థకు మాల్స్ ఉన్నాయి. అక్కడి ప్రభుత్వాలు ఆ సంస్థకు ప్రభుత్వ భూములను ఇవ్వలేదు. ఒక వ్యాపార సంస్థగా లులూ ఎక్కడైనా ప్రైవేటు వ్యక్తుల దగ్గర భూమిని కొనుగోలు చేసి మాల్స్ కట్టుకుని వ్యాపారం చేసుకోవచ్చు. షాపింగ్ మాల్ స్వచ్ఛంద సంస్థ కాదు. నిర్వాహకులకు వచ్చే ఆదాయాన్ని ప్రజలకు, ప్రభుత్వాలకు పంచరు. ప్రభుత్వానికి ఎటువంటి అదనపు ఆదాయం రాదు.

> **అన్ని రకాలైన నిబంధనలను ఉల్లంఘించి లులూకు భూములను కేటాయించిన ప్రభుత్వ పెద్దలు...ఇదంతా యువతకు ఉద్యోగాలు కల్పించడం కోసమేనని పేర్కొనడం ప్రజలను మోసగించడమే. అందులో కొత్తగా వస్తు ఉత్పత్తి ఏమీ ఉండదు. అంటే ఆ సంస్థ ద్వారా వచ్చేవి చిన్నా చితక సేల్స్‌మెన్ ఉద్యోగాలు మాత్రమే. అవి కూడా వందల్లోనే ఉంటాయి. కాబట్టి ప్రభుత్వం చెబుతున్న ఉపాధి కల్పన అనేది నేతి బీరలో నెయ్యి చందమే. లులూ అనే పెద్ద మాల్ వస్తే నగరంలోని వందలాది చిన్న చిన్న వ్యాపార సంస్థలు దెబ్బ తింటాయి. వాటిలో ఇప్పటికే పని చేస్తున్న వేలమంది సేల్స్‌మెన్‌లు తమకు ఉన్న చిన్నపాటి ఉపాధి మార్గాన్ని కూడా కోల్పోతారు. మొత్తం మీద లులూ వస్తే అందులో లభించే ఉద్యోగ అవకాశాల కన్నా కోల్పోయే ఉద్యోగాలే ఎక్కువ.**

అన్ని రకాలైన నిబంధనలను ఉల్లంఘించి లులూకు భూములను కేటాయించిన ప్రభుత్వ పెద్దలు...ఇదంతా యువతకు ఉద్యోగాలు కల్పించడం కోసమేనని పేర్కొనడం ప్రజలను మోసగించడమే. అందులో కొత్తగా వస్తు ఉత్పత్తి ఏమీ ఉండదు. అంటే ఆ సంస్థ ద్వారా వచ్చేవి చిన్నా చితక సేల్స్‌మెన్ ఉద్యోగాలు మాత్రమే. అవి కూడా వందల్లోనే ఉంటాయి. కాబట్టి ప్రభుత్వం చెబుతున్న ఉపాధి కల్పన అనేది నేతి బీరలో నెయ్యి చందమే. లులూ అనే పెద్ద మాల్ వస్తే నగరంలోని వందలాది చిన్న చిన్న వ్యాపార సంస్థలు దెబ్బ తింటాయి. వాటిలో ఇప్పటికే పని చేస్తున్న వేలమంది సేల్స్‌మెన్‌లు తమకు ఉన్న చిన్నపాటి ఉపాధి మార్గాన్ని కూడా కోల్పోతారు. మొత్తం మీద లులూ వస్తే అందులో లభించే ఉద్యోగ అవకాశాల కన్నా కోల్పోయే ఉద్యోగాలే ఎక్కువ. కాబట్టే ప్రభుత్వ భూమిని తమ ఇష్టానుసారంగా పంచిపెట్టిన ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగానే పరిగణించాలి. లులూ సంస్థ చరిత్రను పరిగణలోకి తీసుకున్నా ఆది నష్టాలతోనే నడుస్తోంది. మలేసియాతో పాటు ఇతర దేశాల్లో ఉన్న లులూ మాల్స్ కార్యకలాపాలన్నీ క్రమంగా నిలిచిపోతున్నాయి. అటువంటి సంస్థకు ప్రభుత్వం భూమి రూపంలో సంతర్పణ చేయడం సరికాదు. కాబట్టి ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాలి. ప్రజల భవిష్యత్తు అవసరాలకు, పర్యావరణానికి కీలకమైన ప్రాంతంలో ఉన్న సదరు భూమిని లులూకు కేటాయిస్తూ విడుదల చేసిన జీవోను తక్షణమే రద్దు చేయాలి.

విశాఖ ప్రజా వనరుల పరిరక్షణ వేదిక రాష్ట్ర ప్రభుత్వం ముందు కీలకమైన ప్రత్యామ్నాయ మార్గాన్ని ఉంచుతున్నది. విశాఖ ప్రజలు, నగరానికి నిత్యం వేలాదిగా వచ్చే పర్యాటకుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, విశాఖపట్నం గౌరవాన్ని పెంచేలా లులూకు కేటాయించిన స్థలంలో సైన్సు పార్క్‌ను అభివృద్ధి చేయడం సముచితమైన పని అవుతుంది. మన రాష్ట్రంలో ప్రత్యేకంగా సైన్సు పార్క్ లేదు. భావి భారత పౌరులైన మన విద్యార్థుల్లో అనేక శక్తులు ఇమిడి ఉన్నాయి. నేడు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన మైక్రోసాఫ్ట్ అధినేత సత్య నాదెళ్ల, గూగుల్‌ను నడుపుతున్న సుందర్ పిచాయ్ వంటి వారు మన మధ్య పుట్టి పెరిగి ప్రభుత్వ సంస్థల్లోనే విద్యాభ్యాసం చేసిన వారే. వీరి తరహాలోనే వందల మంది భవిష్యత్తులో ఎదగాలి. ఇందుకు మన రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే సైన్సు పార్క్ అవసరం. మన చిన్నారులు మంచి పౌరసమాజంగా రూపొందాలంటే వారిలో మనోవికాసాన్ని ప్రోదిగొలిపే సైన్సును ప్రోత్సహించాలి. కాబట్టి ఆ స్థలంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో సైన్సు పార్క్‌ను ఏర్పాటు చేసి ప్రజల అభీష్టాన్ని గౌరవిస్తుందని ఆశిద్దాం.

**/ వ్యాసకర్త
విశాఖ ప్రజా వనరుల పరిరక్షణ వేదిక కన్వీనర్/**

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

● నరసాపురం-చెన్నై మధ్య వందేభారత్ రైలు ప్రారంభం కానున్నట్లు కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. శుక్రవారం భీమవరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... నరసాపురం - చెన్నై వందేభారత్ రైలుకు ఆమోదం లభించినట్లు కేంద్ర రైల్వే మంత్రి కార్యాలయం నుంచి సమాచారం అందిందన్నారు.

ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం నశించాలి

- ఆవాజ్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శాంతియుత నిరసన, మానవహారం

ప్రజాశక్తి-చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

అమెరికా సామ్రాజ్యవాదం, ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంతో గాజాలో రక్తపుటేరులు పారుతున్నాయని, దీన్ని నిలువరించేందుకు భారతదేశంతోపాటు ప్రపంచ దేశాలన్నీ చొరవ తీసుకోవాలని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ. చిష్టి అన్నారు. గాజా ప్రజలకు సంఘీభావంగా పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఆవాజ్, అభ్యుదయ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం శాంతియుత నిరసన నిర్వహించారు. స్థానిక కళామందిర్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ప్రపంచ శాంతి వర్ధిల్లాలని, యుద్ధోన్మాదం నశించాలని నినదించారు. ఈ సందర్భంగా చిష్టి మాట్లాడుతూ.. అంతర్జాతీయ చట్టాలను తుంగలో తొక్కి పాలస్తీనా భూభాగాన్ని ఇజ్రాయిల్ ఆక్రమించిందని, నిరాయుధ ప్రజలపై దమనకాండ సాగిస్తోందని వివరించారు. సరిహద్దులు మూసివేయడంతో ఆహారం, మందులు, ఇతర అత్యవసర సాయాన్ని కూడా గాజా ప్రజలకు అందకుండా ఇజ్రాయిల్ అమానవీయంగా వ్యవహరిస్తోందని, గాజాలో ఆకలికేకలు మిన్నంటుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయిల్ దాష్టీకాలపై నిరసనలు వ్యక్తమవుతున్నా ఆ దేశ అధ్యక్షులు పట్టించుకోవడం లేదని, అమెరికా అండ చూసుకుని మారణహోమానికి పాల్పడుతున్నారని అన్నారు. అరబ్ దేశాల్లో అపారంగా ఉన్న చమురు, సహజ వాయువు నిక్షేపాలపై పట్టుకోసమే ఇజ్రాయిల్‌ను అమెరికా ఎగదోస్తోందని, గాజా ప్రజలపై ప్రయోగిస్తున్న బాంబులు, తూటాలు అమెరికా సరఫరా చేస్తున్నవేనని విమర్శించారు. అహింస విధానానికే వెన్నెముకగా నిలిచిన భారతదేశం... పాలస్తీనాకు అండగా నిలవాలని, ఇజ్రాయిల్ దాడులు ఆపేలా ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ ఫైరోజ్, సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



చిలకలూరిపేట కళామందిర్ సెంటర్‌లో మానవహారం చేపట్టిన ఆవాజ్, అభ్యుదయ, ప్రజాసంఘాల నాయకులు

అమరావతిలో పెట్టుబడులు పెట్టండి

- మలేషియా ఇన్వెస్టర్లకు సిఆర్‌డిఎ ఆహ్వానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని మలేషియా ఇన్వెస్టర్లను సిఆర్‌డిఎ ఆహ్వానించింది. మలేషియాలోని సెలాంగోర్ స్టేట్ సెక్రటేరియట్‌లో సెలాంగోర్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో అమరావతి-మలేషియా ఇన్వెస్టర్ల సంయుక్త సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మలేషియా ప్రభుత్వ ప్రతినిధులు తువాన్ పప్పారాయుడు, ఛాంగ్ పార్లమెంట్ సభ్యులు తువాన్ గణపతిరావు వీరమన్ అధ్యక్షత వహించారు. సిఆర్‌డిఎ తరఫున పబ్లిసిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఇన్‌ఛార్జి మండపాటి సిద్ధార్థ వర్మ నాయకత్వం వహించారు. మలేషియా-ఆంధ్రా ఛాంబర్ ఆఫ్ కామర్స్ తరఫున రవీంద్రన్ వెంకటస్వామి, సతీష్‌రావు వెంకటేశం పాల్గొన్నారు. 20కిపైగా కంపెనీలు, డెవలపర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. అమరావతి నగరంపై సిద్ధార్థ వర్మ ప్రెజెంటేషన్ ఇచ్చారు. పెట్టుబడి అవకాశాలను వివరించారు. ఆంధ్రప్రదేశ్-సెలాంగోర్ రాష్ట్రాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, పెట్టుబడి సహకారం మరింతగా విస్తరించడానికి ఉన్న అవకాశాలను చర్చించారు. అమరావతిని నగరాన్ని సందర్శించాలని వారిని ఆహ్వానించారు.

కట్టుకథలు, పిట్టకథల లిక్కర్ స్కాం

- మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కట్టుకథలు, పిట్టకథలతో లిక్కర్ స్కాంను నడిపిస్తున్నారని, దీనిలో ఇంతవరకు ఒక్క ఆధారాన్ని కూడా చూపలేకపోయారని మాజీ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అబద్ధాల పునాదుల మీద లిక్కర్ స్కాంను నడిపిస్తున్నారని వివరించారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను, వైఫల్యాలను ప్రశ్నిస్తే వారిపై అధికారాన్ని ఉపయోగించి తప్పుడు కేసులతో భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. సోషల్ మీడియా కార్యకర్తలపై దాదాపు ఎనిమిది వందల కేసులు పెట్టారని పేర్కొన్నారు. వందల మందిని జైళ్లకు పంపారని వివరించారు. పెద్దిరెడ్డిపై ప్రచారం చేస్తున్నా ఒక్క ఆధారాన్ని కూడా చూపలేకపోయారని తెలిపారు. రాష్ట్రంలో ఎరువులు లేక రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, కూటమి నేతలను రైతులు ప్రశ్నిస్తుంటే వాటిని పక్కదారి పట్టించేందుకు లిక్కర్ స్కాం తీసుకొస్తున్నారని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జగన్‌ను జైలుకు పంపాలన్న ఆలోచనలో నుండే లిక్కర్ స్కాం పుట్టుకొచ్చిందని పేర్కొన్నారు.

మమ్మల్ని బెదిరిస్తున్నారు

- వరల్డ్ బ్యాంకుకు అమరావతిలో ఇద్దరు రైతుల ఫిర్యాదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి పరిధిలో ల్యాండ్ పూలింగులో లేని తమ భూములను ఇవ్వాలని ఎపి సిఆర్‌డిఎ అధికారులు బెదిరిస్తున్నారని ఇద్దరు రైతులు వరల్డ్ బ్యాంకుకు ఫిర్యాదు చేశారు. ఎల్‌పిఎస్ స్కీములో లేని తమ భూములను హోటల్ నిర్మాణానికి కేటాయించి దానికి వీలుగా తమ భూమి సరిహద్దులు తొలగించి బలవంతంగా స్వాధీనం చేసుకున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. మందడం ప్రాంతానికి చెందిన భూ యజమానులు పసుపులేటి జమలయ్య, కలపాల శరత్‌కుమార్ ఈ మేరకు బుధవారం ఫిర్యాదును పంపించారు. తమ భూములు సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన ఉన్నాయని, అక్కడ జివి ఎస్టేట్ అండ్ హోటల్స్‌కు కేటాయించారని పేర్కొన్నారు. తాము భూసమీకరణ పథకంలో లేమని వివరించారు. సిఆర్‌డిఎ అధికారులు తమ భూములు సమీకరణకు ఇవ్వకపోతే ఊరుకోబోమని బెదిరించారని, అభ్యంతరం వ్యక్తం చేశామని తెలిపారు. అయినా వినకుండా తమ భూములకు ఉన్న ఫెన్సింగ్‌ను బలవంతంగా తొలగించారని వివరించారు. దీనిపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా తుళ్లూరు పోలీసుస్టేషన్ సిఐ కూడా భూములు ఎందుకివ్వరని బెదిరించారని పేర్కొన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో తాము ప్రపంచ బ్యాంకుకు ఫిర్యాదు చేస్తున్నట్లు వివరించారు. దీనిపై తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఇందులో జమలయ్యకు సర్వే నెంబరు 225/1లో 40 సెంట్లు, కలపాల శరత్‌కుమార్‌కు సర్వే నెంబరు 225/1లో 30 సెంట్లు భూమి ఉంది. దీనికి సంబంధించిన వివరాలనూ ఫిర్యాదుతో జతచేసినట్లు వారు తెలిపారు. అలాగే సిఎస్, డిజిపి, సిఆర్‌డిఎ కమిషనర్ ఇతర ఉన్నతాధికారులకు ఈ నెల 10న రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేసినట్లు ప్రపంచ బ్యాంకు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వారంలోపు నివేదిక

- 'తురకపాలెం' మరణాలపై మంత్రి సత్యకుమార్ ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లా, తురకపాలెం మరణాలకు దారితీసిన కారణాలపై సమగ్ర నివేదికను వారంలోగా అందించాలని వైద్యారోగ్యశాఖ అధికారులను ఆ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. ఈ అంశంపై సచివాలయంలో శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరుస మరణాల గురించి జిల్లా అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లే సమయంలో జ్వరపీడితులు ఎక్కువగా ఉంటే ఆ సమాచారం జిల్లా అధికారుల ద్వారా రాష్ట్ర అధికారులకు వెంటనే అందే వ్యవస్థను శాఖాపరంగా పటిష్టం చేయాలని ఆదేశించారు. మరణాలకు దారితీసిన కారణాలు, స్థానికుల నుంచి సేకరించిన రక్త నమూనాలు, వాటి ఫలితాల గురించి మంత్రికి ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండియన్, వైద్య విద్య డైరెక్టర్ రఘునందన్ వివరించారు. తురకపాలెంలో 1,501 మందికి 42 రకాల పరీక్షలు నిర్వహించామని అధికారులు చెప్పారు. 109 మంది జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించామని తెలిపారు. బ్లడ్ కల్చర్ పరీక్ష ద్వారా 4 శాతం మందిలో 'మెలియోడోసిస్' ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. మరణాలకు దారితీసిన కారణాలపై సిఫార్సులతో ఇచ్చే నివేదికలో అక్కడ పర్యటించిన వైద్య బృందాల అభిప్రాయాలు, చేసిన సిఫార్సులు ఉండాలని మంత్రి చెప్పారు. తురకపాలెం మాదిరిగానే సమీపంలో ఉన్న కొత్తరెడ్డిపాలెం గ్రామస్తులకు కూడా పరీక్షలు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ పద్మావతి, గుంటూరు జిజిహెచ్ సూపరింటెండెంటు రమణ, వైద్య కళాశాల ప్రిన్సిపల్ సుందరచారి తదితరులు పాల్గొన్నారు.

చేనేతల బకాయిలు రూ.2 కోట్లు విడుదల

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆప్కో సంస్థ చేనేతలకు బకాయిలు రూ.2,00,32,615.41 నిధులను శుక్రవారం విడుదల చేసినట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 84 చేనేత సొసైటీల నుంచి ఆప్కో వస్త్రాలను, ఆప్కో షోరూమ్‌లు, ఈ కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి విక్రయిస్తుందన్నారు. చేనేతల నుంచి కొనుగోలు చేసిన వస్త్రాలకు సంబంధించి బకాయిలు చెల్లించాల్సి ఉందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మొదటి విడతగా రూ.2 కోట్లను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నిధులు ఆయా చేనేత సొసైటీల ఖాతాల్లో జమవుతాయని పేర్కొన్నారు. శ్రీకాకుళం డివిజన్‌లో 4 సొసైటీలకు రూ.7.57 లక్షలు, విజయనగరంలో 7 సొసైటీలకు రూ.3.44 లక్షలు, రాజమండ్రిలో 27 సొసైటీలకు రూ.61.07 లక్షలు, విజయవాడ డివిజన్‌లో 21 సొసైటీలకు రూ.48.29 లక్షలు, తిరుపతి డివిజన్‌లో 17 సొసైటీలకు రూ.36.64 లక్షలు, కడప డివిజన్‌లో 5 సొసైటీలకు రూ.40.30 లక్షలు, కర్నూలు డివిజన్‌లో 7 సొసైటీలకు రూ.2.98 లక్షలు బకాయిలు విడుదల చేసినట్లు వెల్లడించారు. ఆప్కో బకాయిలు అన్నీ చెల్లిస్తామని పేర్కొన్నారు. చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయాలను పెంచేందుకు, జాతీయ స్థాయిలో చేనేత బజార్లను నిర్వహించడంతోపాటు టాటా, బిర్లా, కో-ఆప్టెక్స్‌తోనూ ఒప్పందాలు చేసుకున్నట్లు చెప్పారు. 93 వేల చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, 11,488 మర మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తున్నట్లు వెల్లడించారు. 50 ఏళ్లు నిండిన 92,724 మంది చేనేతలకు రూ.4 వేలు చొప్పున పెన్షన్ ఇస్తున్నామన్నారు.

కాంట్రాక్టు రద్దు ఎవరితరమూ కాదు

- 33 సంవత్సరాల వరకే ప్రయివేటుకు : మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి - నందిగామ (ఎన్‌టిఆర్ జిల్లా) :

పిపిపి పద్ధతిలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల అభివృద్ధి కాంట్రాక్టులను రద్దు చేయడం ఎవరితరమూ కాదని, వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి వల్ల కూడా కాదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా నందిగామలో సుమారు రూ.29 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వంద పడకల ప్రభుత్వాస్పత్రికి మంత్రి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో సత్యకుమార్ మాట్లాడుతూ... జగన్ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా పునాదులకే పరిమితమైన మెడికల్ కళాశాలలను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పిపిపి పద్ధతి వల్ల మెడికల్ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ రావన్నారు. కళాశాలల యాజమాన్య హక్కులు ప్రభుత్వం వద్దే ఉంటాయన్నారు. కేవలం 33 ఏళ్లు మాత్రమే మెడికల్ కళాశాలల నిర్వహణ ప్రైవేట్ వారి చేతుల్లో ఉంటుందని తెలిపారు. 33 ఏళ్ల తర్వాత తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి వస్తాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది రూపాయల వ్యయంతో కేన్సర్ గుర్తింపు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రూ.4500 కోట్ల వ్యయంతో ప్రతి గ్రామంలో విలేజ్ క్లినిక్‌లు నిర్మిస్తున్నామని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో అవినీతిలో కూరుకుపోయిన ఆరోగ్య శాఖను ప్రక్షాళన చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్యరాజు 'బ్రహ్మానందం' ఢిల్లీలో 'మీ అండ్ నేను' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

30 ఏళ్ల సినీ ప్రస్థానంలో వెయ్యికి పైగా చిత్రాల్లో నటించిన హాస్యరాజు బ్రహ్మానందమని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు తెలిపారు. మిమిక్రీ, 'పాకపాకలు' షో ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టిన బ్రహ్మానందం... కోట్లాదిమందికి స్ఫూరిదాయకమన్నారు. 'మీ అండ్ నేను' ఆంగ్లం, హిందీ భాషల్లో రచించిన ఆత్మకథను ఢిల్లీలోని ఆఫీసర్స్ క్లబ్‌లో వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. దీంతో, ఆరు భాషల్లో ప్రచురించినట్లయింది. బురద నుంచి కమలం పుడుతుందని, కష్టపడి పనిచేస్తే విజయం వరిస్తుందని బ్రహ్మానందం తెలిపారు. 1,200 సినిమాల్లో నటించానన్నారు. రాజకీయాల్లోకి వెళ్లే ప్రతిపాదన, అలాంటి ఆలోచన తనకు లేదని స్పష్టత ఇచ్చారు.

భెల్‌కు రైల్వే ఉంచి రూ.23 కోట్ల ఆర్డర్



బెంగళూరు : ప్రభుత్వ రంగంలోని ప్రముఖ విద్యుత్ ఉత్పత్తి పరికరాలు, ఇంజనీరింగ్ కంపెనీ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్) కవాచ్ ఎక్విప్‌మెంట్ సరఫరా కోసం భారత రైల్వేస్ నుంచి రూ. 22.87 కోట్ల విలువైన ఆర్డర్ సాధించింది. ఈ ఒప్పందంలో భాగంగా ఆటోమెటిక్ ట్రెయిన్ ప్రొటెక్షన్ సిస్టమ్‌నకు సంబంధించిన కవాచ్ పరికరాలను సరఫరా, ఇన్‌స్టాల్ చేసి ఇవ్వనుంది. ఈ ఆర్డర్‌ను సౌత్ వెస్టర్న్ రైల్వే నుంచి పొందినట్లు శుక్రవారం భెల్ రెగ్యూలేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది. దీనికి సంబంధించి భారత రైల్వే శాఖ నుంచి సెప్టెంబర్ 11న లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఒఐ)ని పొందినట్లు తెలిపింది. ఇది లోకోమోటివ్‌లలో ఆన్ బోర్డ్ కవాచ్ ఎక్విప్‌మెంట్ డిజైన్, అభివృద్ధి, సరఫరా, ఇన్‌స్టాలేషన్, ట్రయల్, కమిషనింగ్ తదితర సంబంధిత పనులు చేసి ఇవ్వనున్నట్లు పేర్కొంది.

ఆగస్టులో పెరిగిన ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ : రిటైల్ ద్రవ్యోల్బణం పెరిగింది. ఈ ఏడాది ఆగస్టులో వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) 46 బేసిస్ పాయింట్లు పెరిగి 2.7 శాతానికి చేరిందని కేంద్ర గణాంకాల శాఖ శుక్రవారం వెల్లడించింది. ఇంతక్రితం జులైలో ఇది 1.61 శాతంగా చోటు చేసుకుంది. ఆగస్టులో రూరల్ ద్రవ్యోల్బణం సూచీ 1.69 శాతంగా, పట్టణ సిపిఐ 2.47 శాతంగా ఉన్నాయి. అహార ద్రవ్యోల్బణం మాత్రం మైనస్ 0.69 శాతంగా నమోదయ్యింది. ఇది వరుసగా మూడో మాసం ప్రతికూల ద్రవ్యోల్బణమని పేర్కొంది.

సెన్సెక్స్ 356 పాయింట్ల పెరుగుదల

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు కొనుగోళ్ల మద్దతుతో లాభాల్లో ముగిశాయి. శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 356 పాయింట్లు పెరిగి 81,904.70కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 105.50 పాయింట్లు లాభపడి 25,114 వద్ద ముగిసింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు, భారత్– అమెరికా మధ్య వాణిజ్య చర్చలు మదుపర్లలో విశ్వాసాన్ని నింపాయని బ్రోకర్లు పేర్కొన్నారు. సెన్సెక్స్ 30 సూచీలో బిఇఎల్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, మారుతీ సుజుకీ షేర్లు అధికంగా లాభపడగా.. మరోవైపు ఎటెర్నల్, హిందుస్థాన్ యూనిలీవర్, ట్రెంట్, టైటాన్, భారతీ ఎయిర్ టెల్ షేర్లు అధిక నష్టాలను చవి చూశాయి.

ట్రంప్ సుంకాలు స్వయం వినాశకరం

- గ్లోబల్ స్తబ్దతకు దారి తీస్తాయి
- భారత్‌కూ అతిపెద్ద దెబ్బనే..
- ఆర్‌బిఐ మాజీ గవర్నర్ సి రంగరాజన్



ప్రజాశక్తి - హైదరాబాద్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అధిక టారిఫ్‌లు స్వయం వినాశకానికి దారి తీస్తాయని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మాజీ గవర్నర్ సి రంగరాజన్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ 15వ కాన్వకేషన్‌లో రంగరాజన్ మాట్లాడుతూ.. ట్రంప్ కఠినమైన సుంకాలు, ఆర్థిక విధానాలను విమర్శించారు. యుఎస్ విధానాలు ప్రపంచ ఆర్థిక ధోరణులను స్థబ్దతకు గురి చేస్తాయని హెచ్చరించారు. అమెరికాకు కూడా స్వయం వినాశకరమేనని అన్నారు. ట్రంప్ ఆర్థిక విధానాల వల్ల భారత్ అత్యంత దెబ్బతిన్న దేశంగా ఉందని చెప్పారు. వివిధ దేశాలు స్వేచ్ఛాయుత వాణిజ్యాన్ని అనుమతించే బ్లాక్‌లుగా ఏర్పడటం అనివార్యమని రంగరాజన్ అన్నారు. కాగా.. బ్రిక్స్‌ను నేరుగా ఆయన ప్రస్తావించలేదు. బ్రిక్స్ అనేది దక్షిణాది దేశాల కోసం ఒక రాజకీయ, దౌత్యపరమైన సమన్వయ వేదికగా ఉంది. ఇందులో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, సౌదీ అరేబియా, ఈజిప్ట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్ వంటి దేశాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా స్వేచ్ఛాయుత వాణిజ్యమే అతిపెద్ద లక్ష్యాంగా ఉండాలని ఆయన సూచించారు.

"ప్రపంచం ఈ రోజు అస్థిర స్థితిలో ఉంది. ట్రంప్ తీసుకుంటున్న కొన్ని ఆర్థిక విధానాలు ప్రపంచ వాణిజ్యాన్ని స్తబ్దతకు గురి చేస్తున్నాయి. అమెరికాలోని విధాన నిర్ణేతలు తాము అనుసరిస్తున్న విధానాలు స్వయం వినాశకరమని త్వరలోనే గ్రహిస్తారన్నారు. ట్రంప్ సుంకాలు, ఆర్థిక విధానాలతో భారత్ అత్యంత దెబ్బతిన్న దేశంగా నిలుస్తుంది." అని రంగరాజన్ అన్నారు.

సగటున 11.41 శాతం వృద్ధి అవసరం..

కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న 2047 నాటికి భారతదేశం స్వాతంత్ర్యం సాధించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకునే సమయానికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే.. రాబోయే 25 సంవత్సరాల పాటు సగటున 11.41 శాతం వార్షిక వృద్ధి రేటును నమోదు చేయాల్సి ఉంటుందని రంగరాజన్ అన్నారు. కాగా.. 2012-13 నుండి 2023-24 వరకు దేశం సగటున 6.1 శాతం జిడిపిని నమోదు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇది సరిపోదని.. వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడానికి నామమాత్ర జిడిపిని 11.41 శాతం వార్షిక రేటుకు పెంచుకోవాల్సి ఉంటుందన్నారు. 2024-25 కోసం అధిక ఆదాయ దేశాల తలసరి ఆదాయ పరిమితి ప్రస్తుతం 14,006 డాలర్లుగా ఉందని.. 2047-48 నాటికి తలసరి ఆదాయ లక్ష్యం సుమారు 18,414 డాలర్లకు చేరొచ్చన్నారు. 2022-23 నాటికి భారతదేశ తలసరి ఆదాయం 2,381 డాలర్లుగా ఉందని రంగరాజన్ అన్నారు. ఇది ప్రధాన సవాల్‌ను విసురుతుందన్నారు. దీన్ని అధిగమించడానికి అధిక ఎక్కువ వృద్ధి రేటు అవసరమన్నారు.

ఢిల్లీలోనే బాణసంచా నిషేధం ఎందుకు?

- దేశవ్యాప్తంగా విధానాన్ని రూపొందించాలి : సిజెఐ

న్యూఢిల్లీ : ఉన్నతవర్గాలు నివసిస్తున్నందున ఢిల్లీలోనే బాణాసంచాపై నిషేధం విధించాలా? అని సుప్రీంకోర్టు ఘాటుగా ప్రశ్నించింది. బాణాసంచాపై నిషేధం ఢిల్లీకే పరిమితం కాకూడదని, దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు కూడా కాలుష్య రహితమైన గాలిని పొందే హక్కు ఉందని సుప్రీంకోర్టు శుక్రవారం మౌఖికంగా వ్యాఖ్యానించింది. వాయు కాలుష్యంపై నివేదికను సమర్పించా ల్సిందిగా వాయు నాణ్యతా నిర్వహణ సంస్థ (సిఎక్యూఎం) ఆదేశించింది. ఈ పిటిషన్‌పై విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. బాణాసంచాపై నిషేధాన్ని దేశవ్యాప్తంగా అమలు చేసేలా ఒక ప్రణాళికను రూపొందించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయి అభిప్రాయపడ్డారు. ఈ పరిశ్రమపై ఆధారపడిన పేద ప్రజలను కూడా పరిగణన లోకి తీసుకోవాలని అన్నారు. శీతాకాలం, దీపావళి పండుగలు వస్తుండటంతో ఈ అంశంపై విచారణ చేపట్టింది. దేశంలోని ఇతర ప్రాంతాలు, నగరాల్లో నివసించే పౌరులకు దేశ రాజధాని నగరంలోని ఉన్నతవర్గానికి లభించినంత ఉపశమనం ఎందుకు ఇవ్వకూడదని జస్టిస్ బిఆర్ గవాయ్ ప్రశ్నించారు. ఇది దేశ రాజధాని నగరం లేదా సుప్రీంకోర్టు ఈ ప్రాంతంలో ఉన్నందున, భారతదేశంలోని ఇతర ప్రాంతాలకు కాకుండా కాలుష్య రహిత గాలి ఇక్కడ ఉండాలా అని ప్రశ్నించారు. వాయుకాలుష్యాన్ని ఎదుర్కోవడానికి ఉన్నతవర్గానికి సొంత మార్గాలు ఉన్నాయని ఈ కేసుల్లో అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్ పేర్కొన్నారు. వీధుల్లో ఉన్న ప్రజలు, నిర్మాణ కార్మికులు, రోజువారీ కూలీలు వాయుకాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని చెప్పారు.

మద్యం కేసు నిందితులకు 18 వరకు రిమాండ్ గడువు పొడిగింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మద్యం కేసు నిందితులకు విజయవాడ ఎసిబి కోర్టు ఈ నెల 18 వరకు రిమాండ్ గడువును పొడిగించింది. ఇదే కేసులో నిందితుల డీఫాల్ట్ బెయిల్ కోసం ఎ-1గా ఉన్న రాజ్‌కసిరెడ్డి, ఎ-6 సజ్జల శ్రీధర్‌రెడ్డి, ఎ-8 చాణక్య దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను కూడా ఈ నెల 18కి ఎసిబి కోర్టు వాయిదా వేసింది. నిందితులను కోర్టుకు తీసుకొచ్చి, తిరిగి జైలుకు వెళ్లే సమయంలో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనకు లిక్కర్ కేసుతో సంబంధం లేదంటూ పెద్దగా అరవడంతోపాటు తనను అక్రమంగా ఇరికించిన వారిని వదిలిపెట్టనంటూ పోలీస్ వాహనం ఎక్కడం గమనార్హం. మద్యం కేసులో మాజీ డిప్యూటీ సిఎం నారాయణ స్వామి ఫోన్‌ను ఎఫ్ఎస్ఎల్‌కు పంపేందుకు ఎసిబి కోర్టు అనుమతినిచ్చింది. నారాయణ స్వామి కాల్‌డేటాతో పాటు బ్యాంక్ లావాదేవీలపై సిట్ దృష్టిసారించింది. ఇప్పటికే నారాయణ స్వామిని విచారించిన సంగతి తెలిసిందే.

దిలీప్ బెయిల్ షరతులు ఉల్లంఘిస్తున్నారంటూ సిట్ ఫిర్యాదు

మద్యం కేసులో నిందితుడు, బెయిల్‌పై ఉన్న పైలా దిలీప్ బెయిల్ షరతులు ఉల్లంఘిస్తున్నారని, ఆయన అనుమానాస్పద లావాదేవీలు చేస్తున్నారని ఎసిబి కోర్టుకు సిట్ ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై నిబంధనలు ఉల్లంఘించొద్దని దిలీప్‌కు కోర్టు సూచించింది.

కంగనా రనౌత్‌కు ఎదురుదెబ్బ

ఉపశమనం కల్పించేందుకు సుప్రీం నిరాకరణ

రైతుల నిరసనపై ట్వీట్‌కు మసాలా జోడించారని వ్యాఖ్య

న్యూఢిల్లీ : రైతుల నిరసనకు సంబంధించిన ట్వీట్‌పై సుప్రీంకోర్టులో ప్రముఖ సినీ నటి, బిజెపి ఎంపి కంగనా రనౌత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. తనపై పరువు నష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ ఆమె వేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం నిరాకరించింది. ట్రయల్ కోర్టులోనే పరిష్కరించు కోవాలని సూచించడంతో ఆమె తరపున న్యాయవాది ఈ పిటిషన్‌ను శుక్రవారం ఉపసంహ రించుకున్నారు. కేంద్రం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించాలని కోరుతూ రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో నిరవధిక ఆందోళన నిర్వహించారు. ఆ ఆందోళనల్లో పంజాబ్‌లోని బహదూర్‌గఢ్ జాండియన్ గ్రామానికి చెందిన 73 ఏళ్ల మహిందర్ కౌర్ పాల్గొన్నారు. ఈ ఆందోళనలకు సంబంధించిన ట్వీట్‌ను కంగనా రనౌత్ రీట్వీట్ చేస్తూ... ఈ ఆందోళనలో షహీన్ బాగ్ దాది కూడా చేరిందంటూ వ్యాఖ్యలు జోడిం చారు. ఈ పోస్ట్‌పై మహిందర్ కౌర్ 2021 జనవరిలో బటిండాలోని జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించారు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా షహీన్‌బాగ్ నిరసనల్లో పాల్గొన్న మహిళల్లో ఒకరైన బిల్కిస్ బానోగా తనను పేర్కొనడం ద్వారా తన పరువుకు కంగనా రనౌత్ నష్టం కలిగించారని ఆమె పేర్కొన్నారు. ఐపిసిలోని 499, 500 సెక్షన్ల కింద ఫిర్యాదు నమోదు చేశారు. ప్రాథమిక సాక్ష్యాలను నమోదు చేసిన తర్వాత, 2022 ఫిబ్రవరి 22న విచారణకు హాజరు కావాలని కంగనా రనౌత్‌కు మేజిస్ట్రేట్ సమన్లు జారీ చేశారు. మహిందర్ కౌర్ ఫిర్యాదు, సమన్లను రద్దు చేయాలని కోరుతూ పంజాబ్ – హర్యానా హైకోర్టును రనౌత్ ఆశ్రయించారు. సమన్ల ఉత్తర్వులు సహేతుకమైనవని, పరువు నష్టం కలిగిందనడానికి తగినన్ని ప్రాథమిక సాక్ష్యాలున్నాయని పేర్కొంటూ హైకోర్టు ఆమె పిటిషన్‌ను తోసిపుచ్చింది. వాస్తవం తెలిసిన తర్వాత ఫిర్యాదుదారునికి క్షమాపణ చెప్పడంలో రనౌత్ విఫలమయ్యారని, లక్షలాదిమంది ఫాలోవర్లు ఉన్న ఆమె తన వ్యాఖ్యల నిజాయితీని నిరూపించుకోవాల్సిన అదనపు బాధ్యతలు కలిగి ఉన్నారని హైకోర్టు వ్యాఖ్యానించింది. కేసును కొనసాగించాలనే మేజిస్ట్రేట్ నిర్ణయాన్ని సమర్థించింది.

అవి సాధారణ వ్యాఖ్యలు కావు : సుప్రీంకోర్టు

తనపై దాఖలైన క్రిమినల్ పరువు నష్టం దావాను కొట్టివేయాలని కోరుతూ రనౌత్ తాజాగా దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు శుక్రవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. విచారణ ప్రారంభంలో, కంగనా రనౌత్ వ్యాఖ్యలపై జస్టిస్ సందీప్ మెహతా అభ్యంతరం వ్యక్తం చేశారు. "మీ వ్యాఖ్యల సంగతేంటి? ఇది సాధారణ రీట్వీట్ కాదు. మీరు మీ స్వంత వ్యాఖ్యలను జోడించారు. మీరు మసాలా జోడించారు," అని ఆయన వ్యాఖ్యానించారు. పోస్ట్‌కు సంబంధించి ఇప్పటికే ఇచ్చిన వివరణను ఆమె న్యాయవాది సమర్పించారు.

దీనికి, జస్టిస్ మెహతా స్పందిస్తూ, ఈ వివరణను ట్రయల్ కోర్టు ముందు ఇవ్వాలని అన్నారు. ఆమె న్యాయవాది మరింత వాదించడానికి ప్రయత్నించగా, "ట్వీట్‌లో రాసిన దానిపై వ్యాఖ్యానించాలని మమ్మల్ని అడగవద్దు. ఇది మీ విచారణకు పక్షపాతం కలిగించవచ్చు. మీకు చెల్లుబాటు అయ్యే రక్షణ ఉండవచ్చు" అని జస్టిస్ మెహతా పేర్కొన్నారు. ఆమె న్యాయవాది ఆ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అంగీకరించారు, ఆ తర్వాత బెంచ్ ఈ విషయాన్ని "తిరస్కరించబడినట్లుగా కొట్టివేయబడింది" అని నమోదు చేసింది.

ఆర్‌ఎంపిలు ప్రథమ చికిత్సకే పరిమితం

యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ ఇవ్వకూడదు
ఎపి మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరిరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అత్యవసర ప్రథమ చికిత్సకు మాత్రమే ఆర్‌ఎంపిలు, పిఎంపిలు పరిమితం కావాలని ఎపి మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరిరావు హెచ్చరించారు. సెలైన్లు పెట్టడం, యాంటీబయాటిక్స్ రాయడం, స్టెరాయిడ్స్ ఇవ్వడం ప్రజారోగ్యానికి హానికరమన్నారు. గుంటూరు జిల్లా తురకపాలెం గ్రామాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గార్లపాటి నందకిషోర్‌తో కలిసి ఆయన సందర్శించారు. వ్యాధి నిర్ధారణ పరీక్ష ఫలితాలను జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, స్థానిక వైద్యాధికారులు శ్రీహరిరావుకు వివరించారు. అనంతరం గ్రామంలో పలు వీధులను ఆయన పరిశీలించారు. ఎపి మెడికల్ కౌన్సిల్ విజిలెన్స్ అధికారి డాక్టర్ ఆషా కిరణ్‌తో కలిసి ఆర్‌ఎంపిలు, పిఎంపిల ప్రథమ చికిత్స కేంద్రాలను తనిఖీ చేశారు. బాధితులకు ఇస్తున్న మందులను పరిశీలించారు. పేరు ముందు 'డాక్టర్' అని బోర్డు పెట్టుకున్న వారి వివరాలను శ్రీ హరిరావు నమోదు చేసుకున్నారు. తురకపాలెంలో చనిపోయిన వారిలో చాలామంది ఈ ప్రథమ చికిత్స కేంద్రంలో సెలైన్లు, యాంటీబయాటిక్స్ విచక్షణ రహితంగా వాడడం జరిగిందన్నారు. శ్రీహరి వెంట ఐఎంఎ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు డాక్టర్ నాగేళ్ల కిషోర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ టి. సేవకుమార్ తదితరులు ఉన్నారు.



తురకపాలెంలో పర్యటిస్తున్న శ్రీహరిరావు, నందకిషోర్, విజయలక్ష్మి

అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి -కర్నూలు లీగల్

నంద్యాల టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కు చెందిన బాలికను ముద్దాయి వివాహం చేసుకుంటానని నమ్మించి 2018 డిసెంబర్ 14న కిడ్నాప్ చేసిలైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ కేసులో ముద్దాయి సాకే రాజకుమార్ అలియాస్ పెద్దకు 20 యేళ్ల జైలు శిక్ష రూ.2.5 లక్షల జరిమానా విధిస్తూ కర్నూలు జిల్లా ఫోక్సో కోర్టు జిల్లా న్యాయమూర్తి ఇ. రాజేంద్రబాబు శుక్రవారం తీర్పు చెప్పారు. న్యాయస్థానం 20 మంది సాక్షులను విచారించిన అనంతరం ముద్దాయిపై నేరం రుజువు కావటంతో జైలు శిక్ష, జరిమానా విధించారు. ఈ కేసులో మిగతా నలుగురు ముద్దాయిలపై నేరం రుజువు కానందున వారిపై కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పోక్సో కోర్టు పిపి సి.వి శ్రీనివాసులు వాదించారు.

ఎస్‌సిలు ఉన్నత స్థాయికి ఎదగాలి

మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఎపి స్టేట్ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. రాష్ట్రంలో ఎస్‌సిల సంక్షేమం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్విరామ కృషి చేస్తున్నారని అన్నారు. శుక్రవారం ఆమె కర్నూలు జిల్లా టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొందరికి వినోదాలు, విహారయాత్రలతో కిక్కు లభిస్తే ముఖ్యమంత్రికి మాత్రం అభివృద్ధి, సంక్షేమం, పోలవరం, అమరావతి నిర్మాణంతో లభిస్తుందన్నారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని జగన్‌హన్‌రెడ్డి నాశనం చేశారన్నారు. ఎస్‌సి కార్పొరేషన్‌ను మూడు ముక్కలుగా చేసి ఒక్క పైసా కేటాయించకుండా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఎస్‌సిల ఉన్నత స్థానాలకు ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు చదువు ఒక్కటే మార్గమన్నారు. రాష్ట్రంలో ఎస్‌సి విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చొరవ చూపిస్తుందన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో, గురుకులాల్లో విద్యార్థులకు ఎంతో నాణ్యమైన పౌష్టికాహారాన్ని తమ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. సుచి, శుభ్రతను పాటించేలా విద్యార్థుల ఆత్మ గౌరవాన్ని పెంచేలా చర్యలు తీసుకుందన్నారు. ఎస్‌సిలు డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, లాయర్లుగా, ఎన్నో ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. ఎస్‌సిలలో మాల, మాదిగలు ఐక్యంగా ఉండాలని సూచించారు. మాదిగ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ థరూర్ జేమ్స్, మాల కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పోతురవి, టిడిపి సీనియర్ నాయకులు కెవి సుబ్బారెడ్డి, కార్పొరేటర్ కైప పద్మలతారెడ్డి , పలువురు ఉమ్మడి కర్నూలు జిల్లా టిడిపి ఎస్‌సిసెల్ నాయకులు పాల్గొన్నారు.

రూ.5,900కే విదేశీ ప్రయాణం

స్కూట్ ఎవిరివేర్ సేల్ ఆఫర్లు

న్యూఢిల్లీ : సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బడ్జెట్ విమానయాన కంపెనీ స్కూట్ అతి తక్కువ ధరల్లో విదేశీ ప్రయాణాలను కల్పిస్తున్నట్లు వెల్లడించింది. స్కూట్ ఎవిరివేర్ సేల్ ఆఫర్‌లో భాగంగా చెన్నయ్ నుంచి సింగపూర్‌కు రూ.5,900కే ప్రయాణాన్ని అందిస్తున్నట్లు పేర్కొంది. విశాఖపట్నం నుంచి బాలికి రూ.9,000, కోయంబత్తూరు నుంచి మెల్‌బోర్న్‌కు రూ.19,500కు, తిరువనంతపురం నుంచి జకార్తకు రూ.8,500తోనే ప్రయాణించవచ్చన్నారు. ఈ బుకింగ్ ఆఫర్ సెప్టెంబర్ 14వరకు మాత్రమే ఉంటుందని.. ఈ ఏడాది సెప్టెంబర్ 23 నుంచి 2026 ఆగస్టు 31 లోపు ప్రయాణిల కోసం బుకింగ్స్‌ను తెరిచినట్లు వెల్లడించింది.

ఉమర్ ఖలీద్ ప్రభృతుల బెయిల్ పిటిషన్లపై 19కి విచారణ వాయిదా

న్యూఢిల్లీ : ఢిల్లీ అల్లర్ల కేసులో జెఎన్‌యు విద్యార్థులు ఉమర్ ఖలీద్, షార్జిల్ ఇమామ్‌ల బెయిల్ పిటిషన్లపై విచారణను శుక్రవారం సుప్రీం కోర్టు ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. గత అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30గంటల సమయంలో ఇందుకు సంబంధించిన ఫైళ్లన్నీ తమ వద్దకు వచ్చాయని, అందువల్ల రికార్డులను పరిశీలించలేకపోయామని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్‌వి అంజారియాలతో కూడిన బెంచ్ తెలిపింది. అందువల్లే విచారణను వారం రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది. ఇమామ్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి, ఉమర్ ఖలీద్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తమ వాదనలు వినిపించారు. నేడు కోర్టు ముందు విచారించాల్సిన జాబితాలో నాలుగు అంశాలు వున్నాయని, అవన్నీ ఒకే హైకోర్టు తీర్పుకి సంబంధించినవని సిబల్ తెలిపారు. సెప్టెంబర్ 2న ఢిల్లీ హైకోర్టు వారికి బెయిల్ నిరాకరిస్తూ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ వారు సుప్రీంను ఆశ్రయించారు.


బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సనారోకు 27ఏళ్ల జైలు



బ్రసీలియా : సైనిక కుట్ర కేసులో బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు, పచ్చి మితవాది జేర్ బోల్సనారోకు 27ఏళ్ల మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. 2022 ఎన్నికల్లో ఓటమి పాలయినప్పటికీ అధికారంలో కొనసాగేందుకు గానూ కుట్రకు ప్రయత్నించారన్న అభియోగాలు రుజువై బోల్సనారో దోషిగా తేలడంతో గురువారం న్యాయమూర్తుల కమిటీ ఈ తీర్పును వెలువరించింది. ప్రస్తుతం బ్రసీలియాలో గృహ నిర్బంధంలో వున్న బోల్సనారో ఈ శిక్షపై అప్పీల్ చేసుకోవచ్చు. తీర్పు ఇచ్చిన కమిటీలోని ఐదుగురు న్యాయమూర్తుల్లో నలుగురు బోల్సనారోపై గల అయిదు అభియోగాల్లోనూ ఆయనను దోషిగా నిర్ధారించారు. ఈ తీర్పు పట్ల చాలా అసంతృప్తిగా వున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానిం చారు. రాజకీయ వేధింపులకు తాను బాధితుడినని బోల్సనారో వ్యాఖ్యానించారు.

తమ నేత ఓడిపోయిన నేపథ్యంలో దురాక్రమణకు దిగిన బోల్సనారో మద్దతుదారులు రాజధానిలోని అత్యంత కీలకమైన భవనాలపై దాడికి తెగించారు. దేశాధ్యక్షుడి అధికార నివాసం, కాంగ్రెస్, సుప్రీంకోర్టు ముందున్న బారికేడ్లను బద్దలుకొట్టి, భవనాల గోడలెక్కి అద్దాలు, కిటికీలు ధ్వంసం చేశారు. ఇందుకు గానూ బోల్సనారోతో పాటు మరో 33 మందిపై అభియోగాలు నమోదయ్యాయి.

చార్లీ కర్క్ హత్య కేసులో నిందితుడు అరెస్ట్


రాబిన్సన్

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుచరుడు, ప్రఖ్యాత యూట్యూబర్ చార్లీ కర్క్ హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేశామని ట్రంప్ శుక్రవారం ప్రకటించారు. రిపబ్లికన్ పార్టీ మద్దతుదారుడైన కర్క్ గురువారం ఊటా వ్యాలీ యూనివర్శిటీలో ఓ కార్యక్రమంలో మాట్లాడుతున్న సమయంలో దుండగుడు జరిపిన కాల్పుల్లో మృతి చెందిన విషయం తెలిసిందే. నిందితుడిని 22 ఏళ్ల టైలర్ రాబిన్సన్‌గా గుర్తించామని, సంఘటనా స్థలంలో రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నామని ఉటా గవర్నర్ స్పెన్సర్ కాక్స్ మీడియాకు తెలిపారు. హత్య అనంతరం పోలీసులు విడుదల చేసిన ఫొటోను గుర్తించి అతని సన్నిహితుడు సమాచారం అందించాడని చెప్పారు. హత్యకు గల కారణం ఇంకా తెలియరాలేదని, దర్యాప్తు జరుగుతుందని త్వరలో మిగతా విషయాలు తెలియజేస్తామని తెలిపారు. అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ తన భార్యతో కలిసి కర్క్ కుటుంబాన్ని పరామర్శించారు. హత్యను ఖండించారు. కర్క్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. నిందితుడు హత్యకు ఉపయోగించిన బుల్లెట్ కేసింగ్ పై " హే ఫాసిస్ట్.. క్యాచ్, బెల్లా సియావో" అని రాసుందని, పక్కా ప్రణాళికతోనే హత్య జరిగిందని పోలీస్ వర్గాలు తెలిపాయి.

వణికిస్తున్న అతిసార

(మొదటిపేజీ తరువాయి)

కరపత్రాలు, మైక్ ప్రచారం ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఆ ప్రాంతంలో ఉన్న 11 వార్డు సచివాలయాలకు ప్రత్యేకాధికారులను నియమించి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. విజయవాడ కలెక్టరేట్లో 91549 70454 నెంబరుతో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

మంత్రులు నారాయణ, సత్యకుమార్ పరామర్శ

రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, పురపాలక శాఖ సంచాలకులు పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎం.సుహాసిని తదితరులు శుక్రవారం న్యూ రాజరాజేశ్వరిపేటలోని అతిసార ప్రభావిత ప్రాంతంలో పర్యటించారు. ప్రత్యేక వైద్య శిబిరంలో బాధితులకు అందిస్తోన్న వైద్యసేవల వివరాలను, బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు భరోసా కల్పించారు. పరిస్థితిని సమీక్షించారు. అధికారులకు దిశానిర్దేశం చేశారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, మెరుగైన వైద్య సేవలకు ఆదేశించారు.


నివాళులర్పిస్తున్న ప్రకాశ్ కరత్


సీతారాం ఏచూరికి ఘన నివాళి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నాడిక్కడ సిపిఎం పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఘనంగా నివాళులర్పించారు. ఆయన తొలి వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి సిపిఎం నేతలు పూలమాలలు వేసి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ మాట్లాడుతూ.. శ్రామిక, అణగారిన వర్గాల పోరాటాలకు ఏచూరి జీవితాంతం అంకితభావంతో పనిచేశారని చెప్పారు. లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సోషలిజం పట్ల ఆయనకు అచంచలమైన నిబద్ధత ఉందని అన్నారు. సిపిఎం సీనియర్ నేతలు ప్రకాష్‌కరత్, బృందాకరత్, నాయకులు తపన్ సేన్, విజూకృష్ణన్, విక్రమ్ సింగ్, జోగేంద్ర శర్మ, రామచంద్రన్ పిళ్లై, హన్నన్ మొల్లా, నీలోత్పల్‌బసు, అరుణ్ కుమార్, జాన్ బ్రిట్టాస్, శ్రీదీప్ భట్టాచార్య, ఢిల్లీలోని కేరళ ప్రత్యేక ప్రతినిధి కెవి థామస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో 34 శాతంమంది వారసులే

- దేశంలో కాంగ్రెస్, బిజెపిల్లో అత్యధికం
- చట్ట సభల సభ్యులపై ఎడిఆర్, ఎన్ఇడబ్ల్యూ నివేదిక



న్యూఢిల్లీ : వారసత్వ రాజకీయాల గురించి తరచూ ప్రసంగాలు చేసే పార్టీలు చట్ట సభలకు వారసులనే అత్యధికంగా పంపిస్తున్నాయి. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ (ఎన్ఇడబ్ల్యూ) విడుదల చేసిన నివేదిక ప్రకారం వంశపారంపర్య నేపథ్యం ఉన్న సభ్యుల శాతం (పర్సెంటేజ్) అత్యధికంగా ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలో మొత్తం 255 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉండగా, వీరిలో 86 మంది అంటే 34 శాతం మంది వంశపారంపర్య నేపథ్యం ఉన్నవారే. మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే ఈశాన్య రాష్ట్రాల్లో వారసులు తక్కువగా ఉన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో అస్సాంలో అత్యధికంగా తొమ్మిది శాతం మంది వారసులున్నారు. జాతీయ పార్టీలతో పోలిస్తే ప్రాంతీయ పార్టీల్లో వంశపారంపర్య నేపథ్యం ఉన్న సభ్యులు ఎక్కువగా ఉన్నారని తెలిపింది. ప్రాంతీయ పార్టీల్లో ఎన్‌సిపి (శరద్‌పవార్), జెకెఎన్‌సిల్లో అత్యధికంగా 42 శాతం మంది ఇలాంటి సభ్యులు ఉన్నారు. ఈ తరువాత వైఎస్ఆర్‌సిపిలో 38 శాతం, తెలుగుదేశం పార్టీలో 36 శాతం, టిఎంసిలో 10 శాతం, ఎఐఎడిఎంకెలో 4 శాతం మంది ఉన్నారు. గుర్తింపు పొందని పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల్లోనూ చెప్పుకోదగ్గ విధంగా ఇలాంటి నేపథ్యం ఉన్నవారు ఉండటం విశేషమని నివేదిక వెల్లడించింది. పురుష సభ్యులతో పోలిస్తే, మహిళల్లో ఈ సంఖ్య భారీగా ఉందని నివేదిక తెలిపింది. పురుష ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల్లో 18 శాత మంది ఈ నేపథ్యం ఉన్నవారు ఉండగా, మహిళల్లో ఇది ఏకంగా 47 శాతంగా ఉంది. దేశంలో మొత్తంగా 4,665 మంది పురుష ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు. వీరిలో 856 మంది అంటే 18 శాతం మంది వంశపారంపర్య నేపథ్యం కలిగి ఉన్నారు. దేశంలో మొత్తంగా 539 మంది మహిళా సభ్యులు ఉండగా, వీరిలో 47 శాతం అంటే 251 మందికి ఇలాంటి నేపథ్యం ఉంది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పురుషల కంటే మహిళల్లో ఇలాంటి నేపథ్యం ఎక్కువగా ఉంది. దేశంలో మొత్తంగా 94 మంది స్వతంత్ర ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు. వీరిలో 23 మంది అంటే 24 శాతం మందికి ఇలాంటి నేపథ్యం ఉంది.

ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 141 మంది వారసులు

రాష్ట్రాల పరంగా చూసుకుంటే ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 141 మంది వారసులున్నారు. ఈ రాష్ట్రంలో మొత్తం 604 మంది ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు. వీరిలో 23 శాతం మందికి వంశపారంపర్య నేపథ్యం ఉంది. ఆ తరువాత మహారాష్ట్రలో 129 మంది (మొత్తం 403 మంది, 32 శాతం), బీహార్‌లో 96 మంది (మొత్తం 360 మంది, 27 శాతం), కర్ణాటకలో 94 మంది (మొత్తం 326 మంది, 29 శాతం) ఉన్నారు.

దేశవ్యాప్తంగా 21 శాతం మంది వారసులే

జాతీయ పార్టీల్లో కాంగ్రెస్, బిజెపిలు తొలి రెండు స్థానాల్లో ఉండగా, అత్యల్పంగా సిపిఎంలో ఉన్నారు. దేశంలోని 5,204 మంది ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల్లో 21 శాతం మంది వంశపారంపర్య నేపథ్యం ఉన్నవారే. లోక్‌సభలో అత్యధికంగా 31 శాతం మంది వారసులున్నారు. జాతీయపార్టీల పరంగా కాంగ్రెస్‌లో 32 శాతం, బిజెపిలో 18 శాతం సభ్యులు ఉన్నారు.

బిజెపిలోనూ వారసులే?

తరచూ వారసత్వ రాజకీయాల గురించి ప్రధాని నరేంద్రమోడీ, హోం మంత్రి అమిత్‌షాతోపాటు చోటామోటా బిజెపి నేతల వరకూ విమర్శలు గుప్పిస్తూ ఉంటారు. దేశంలో వారసులు అత్యధికంగా ప్రజాప్రతినిధులుగా ఉన్న రెండో జాతీయ పార్టీగా ఉండటాన్ని ప్రస్తావిస్తూ... ఇటువంటి విమర్శలు చేసే నైతిక హక్కు బిజెపికి లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దేశంలో వంశపారంపర్య నేపథ్య రాజకీయాలను 'వ్యవస్థ నిర్మాణాత్మక లక్షణం'గా నివేదిక వర్ణించింది. గెలుపు సామర్థ్యం, రోజురోజుకూ పెరిగిపోతున్న ఎన్నికల వ్యయం, రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం లేకపోవడం వంటి కారణాలతో దేశ రాజకీయాల్లో వంశపారంపర్య నేపథ్యం ఉన్న అభ్యర్థులు పట్టు బలంగా ఉందని, పార్టీలు కూడా సీట్ల కేటాయింపులో వీరికే ప్రాధాన్యతను ఇస్తున్నాయని నివేదిక తెలిపింది.

గో బ్యాక్ మోడీ

- నిరసనలకు మణిపూర్ మహిళా సంఘాల పిలుపు
- బిజెపి నేతల మూకుమ్మడి రాజీనామా

ఇంఫాల్ : మణిపూర్‌లో నరమేధం, మహిళలపై తీవ్ర హింసను అడ్డుకోవడానికి ప్రయత్నించకపోగా, రెండేళ్ల నాలుగు నెలలపాటు మొఖం చాటేసి ఇప్పుడు పర్యటిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీకి నిరసన తెలపనున్నట్లు రాష్ట్రంలోని ప్రముఖ మహిళా సంఘాలు ప్రకటించాయి. మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ 'గో బ్యాక్ మోడీ' పేరిట శనివారం నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపాయి. మోడీని కసాయిగా వర్ణించాయి. 'వర్కింగ్ గ్రూప్ ఆఫ్ మీరా ఫైబి' బ్యానర్ కింద వీధుల్లో ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపాయి. వర్కింగ్ గ్రూప్ ప్రధాన కార్యదర్శి అపాబీ లీమా ఇంఫాల్‌లో మాట్లాడుతూ 2023 మే 3 నుంచి రాష్ట్రంలో చెలరేగుతున్న హింసను పరిష్కరించడంలో ప్రధానమంత్రి విఫలమైనందున నిరసన తెలియజేయాలనే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. హింసా కాండలో వందలాదిమంది మరణించారని, వేలాది మంది గాయాలు, లైంగిక హింసకు గురయ్యారని చెప్పారు. అనేకవేల మంది నిరాశ్రయులుగా మారి ఇప్పటికీ సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్నారని గుర్తుచేశారు. 'హింసను అంతం చేయడానికి ఏమీ చేయకుండా.. రాష్ట్రంలో ఎందుకు పర్యటిస్తున్నారు? మణిపూర్‌ను పూర్తిగా నాశనం చేయడానికి మరొక వ్యూహంతో వస్తున్నారా.?' అని ఆమె ప్రశ్నించారు. ఈ నిరసనల్లో 'మోడీ గో బ్యాక్', 'స్వీయ నిర్ణయాధికారం మా హక్కు', 'ఎఎఫ్ఎస్‌పిఎ ఒక వలస చట్టం', 'విభజించి పాలించే విధానాన్ని ఆపండి', 'మోడీ పర్యటనను వ్యతిరేకిస్తున్నాం' వంటి నినాదాలు చేయనున్నట్లు చెప్పారు. పీపుల్స్ ప్రోగ్రెసివ్ అలయన్స్ మణిపూర్ (పిపిఎఎం) నాయకులు కూడా మోడీ పర్యటనను వ్యతిరేకించారు. ఈ పర్యటనలో మోడీతో మహిళా సంఘాలు, పౌర సమాజ సంస్థల ప్రతినిధులు మాట్లాడానికి అవకాశం ఇవ్వకపోవడాన్ని ఖండించారు.

ప్రచారం కోసమే మోడీ పర్యటన

మోడీ పర్యటన కేవలం ప్రచారం కోసమేనని కాంగ్రెస్ విమర్శించింది. మణిపూర్ పిసిసి అధ్యక్షులు కిషమ్ మేఘచంద్ర ఒక వీడియో సందేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. 'రాష్ట్ర ప్రజలు శాంతి, పునరావాసం, న్యాయం కోసం ఒక నిర్దిష్ట రోడ్‌మ్యాప్‌ను ఆశిస్తున్నారు. ఈ పర్యటనలో భాగస్వామ పక్షాలతో చర్చలు లేకపోవడం బాధాకరం' అని అన్నారు. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జైరామ్‌రమేష్ ఈ పర్యటన గురించి స్పందిస్తూ 'మణిపూర్‌లో మోడీ మూడు గంటల కన్నా తక్కువ సమయమే గడుపుతారు. శాంతి,సామరస్యం నెలకొల్పడానికి ప్రోత్సాహానికి బదులుగా, ఈ పర్యటన ఒక ప్రహసనంగా మారనుంది' అని పేర్కొన్నారు.

బిజెపి నేతల మూకుమ్మడి రాజీనామా

మణిపూర్ పర్యటన ముందు ప్రధాని నరేంద్ర మోడీకి సొంత పార్టీ నేతలు షాక్ ఇచ్చారు. క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తల అభిప్రాయాలను నాయకత్వం పట్టించుకోవడం లేదని, పార్టీ రాష్ట్ర కమిటీలో ఐకమత్యం కొరవడిందని విమర్శిస్తూ ఫుంగ్యార్ మండలానికి చెందిన 43 మంది బిజెపి సభ్యులు పార్టీ ప్రాథమిక సభ్యత్వాలకు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. రాష్ట్ర బిజెపికి ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉన్న నగచోమ్మీ రాంషాంగ్ నేతృత్వంలో వీరందరూ రాజీనామాలు సమర్పించారు. వీరిలో ఫుంగ్యార్ మండల పార్టీ అధ్యక్షుడు, మహిళా మోర్చా అధ్యక్షురాలు, యువ మోర్చా అధ్యక్షుడు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు, ఎస్టీ మోర్చా కార్యవర్గ సభ్యుడితో పాటు బూత్ స్థాయి అధ్యక్షులు కూడా ఉన్నారు. పార్టీలో నెలకొన్న పరిస్థితులపై వారంతా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

నేపాల్ కొత్త ప్రధానిగా సుశీలా కర్కి

(మొదటిపేజీ తరువాయి)

అభ్యసించారు. 1972లో మహేంద్రా మొరాగ్ కేంపస్ నుంచి బిఎ ఆర్ట్స్ చేసిన ఆమె తర్వాత 1975లో బనారస్ హిందూ యూనివర్శిటీలో పొలిటికల్ సైన్స్‌లో మాస్టర్స్ చేశారు. తర్వాత 1978లో నేపాల్‌లోని త్రిభువన్ యూనివర్శిటీలో లా డిగ్రీ తీసుకున్నారు. అనంతరం న్యాయవాద వృత్తిని చేపట్టారు. విద్యార్థిగా వున్న సమయంలో ఆమెకు నేపాలీ కాంగ్రెస్‌తో అనుబంధం వుంది. అప్పుడు ఆ పార్టీ దేశంలో ప్రజాస్వామ్యం కోసం పోరాడుతోంది. తర్వాత ఆమె తన ట్యూటర్ దుర్గా సుబేదినే వివాహం చేసుకున్నారు. 2006 చివరిలో ఆమె నేపాల్ సుప్రీంకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఏడేళ్ల తర్వాత ఆమె చీఫ్ జస్టిస్ పదవికి పదోన్నతి పొందారు. ఆమె పదవీకాలం వివాదాస్పదమైంది. నేపాలీ కాంగ్రెస్ ఆమెను తొలగించకపోయినా తన పార్లమెంట్ బలంతో ఆమెను అభిశంసించడానికి ప్రయత్నించింది. రాజకీయ సంబంధాలు కలిగిన వారిని జడ్జిలుగా నియమించినందుకు ఆమె విమర్శలు ఎదుర్కొన్నారు. ఆమె తన వైఖరిని సమర్థించుకున్నారు. ఒకసారి బెంచ్‌లోకి వచ్చిన తర్వాత తమ రాజకీయ బాంధవ్యాలను ఎవరైనా విడనాడాల్సిందేనని ఆమె అన్నారు.

సుశీలా కర్కికి జనరేషన్ జెడ్ ఏకగ్రీవ మద్దతు

అంతకుముందు సుశీలా కర్కికి జనరేషన్ జెడ్ నిరసనకారులు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. మొత్తంగా పార్లమెంట్‌ను రద్దు చేయాలా? వద్దా? అనే అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఆమెను అధికారికంగా నియమించడానికి ఏ రాజ్యాంగ నిబంధనను ఉపయోగించాలి? అనే అంశంపై కూడా గందరగోళం నెలకొంది.

నేపాల్ చీఫ్ జనరల్ అశోక్ సిగ్దేల్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడు రామ్ చంద్ర పౌడల్ గురువారం అర్ధరాత్రి న్యాయ, రాజ్యాంగ నిపుణులతో చర్చలు జరిపినట్లు సంబంధిత వర్గాలు ప్రకటించాయి. శుక్రవారం ఉదయం 9గంటలకు ప్రారంభమవాల్సిన చర్చలు మధ్యాహ్నానికి ప్రారంభమయ్యాయి. ఎట్టకేలకు రాత్రికల్లా ఒక పరిష్కార మార్గం ఏర్పడింది. జస్టిస్ సుశీల్ కర్కి తాత్కాలిక ప్రభుత్వానికి నేతృత్వం వహించేందుకు అన్ని వర్గాలు అంగీకరించాయని అధ్యక్షుడు పౌడెల్ ప్రధాన రాజకీయ పార్టీలకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది.

రాజ్యాంగ పరిధిలోనే...

ఈ పరిస్థితుల్లో దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని ప్రస్తుత రాజ్యాంగం పరిధిలోనే పరిష్కరించుకోవడానికి చర్యలు తీసుకోవాలని ప్రతినిధుల సభ స్పీకర్ దేవరాజ్ ఘిమిరె, నేషనల్ అసెంబ్లీ చైర్మన్ నారాయణ్ దహల్ తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ప్రజల సార్వభౌమాధికారాన్ని, పౌర స్వేచ్ఛను, ప్రాదేశిక సమగ్రతను, దేశ ఐక్యతను, స్వాతంత్ర్యాన్ని గౌరవిస్తూనే, పరిస్థితిని చక్కదిద్దడానికి అధ్యక్షుడు చర్యలు తీసుకుంటున్నారని వారు తెలిపారు. ఆందోళనకారుల డిమాండ్లను పరిష్కరించడానికి, మరింత పటిష్టమైన, సంపద్వంతమైన ప్రజాస్వామ్యానికి కట్టుబడి వుండాల్సిందిగా కూడా వారు అన్ని పార్టీలకు పిలుపునిచ్చారు. రిటైర్డ్ న్యాయమూర్తులు రాజకీయ లేదా రాజ్యాంగ పదవులను నిర్వహించడాన్ని నేపాల్ రాజ్యాంగం నిషేధిస్తోంది. అధ్యక్షుడు పౌడల్ తీసుకున్న వైఖరికి ప్రధాన రాజకీయ పార్టీలు కూడా మద్దతిస్తున్నాయి. జనరేషన్ జడ్ ఉద్యమానికి నాయకత్వం అంటూ లేకపోవడంతో వారిలో కూడా పలు అభిప్రాయాలు తలెత్తుతున్నాయి.

51కి పెరిగిన మృతులు

నేపాల్ ఆందోళనల్లో మరణించిన వారి సంఖ్య 51కి చేరినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. ఆందోళనల సమయంలో దేశవ్యాప్తంగా పలు జైళ్ల నుండి తప్పించుకున్న 12,500మందికి పైగా ఖైదీలు ఇప్పటికీ పరారీలోనే ఉన్నారని పోలీస్ ప్రతినిధి బినోద్ ఘిమిరే తెలిపారు.

చక్కబడుతున్న పరిస్థితులు

నేపాల్ జన జీవనం సాధారణ స్థితికి చేరుకుంటోంది. నెమ్మదిగా పరిస్థితులు చక్కబడుతున్నాయి. ఈ వారం ప్రారంభంలో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు పెచ్చరిల్లినప్పుడు ధ్వంసమైన పోలీస్‌స్టేషన్లు, చెక్‌పోస్టులు తిరిగి కార్యకలాపాలు మొదలెట్టాయని అధికారులు తెలిపారు. నేపాల్ పోలీసులు, సాయుధ పోలీస్ దళ సిబ్బంది యథావిధిగా తమ కార్యకలాపాలను పునరుద్ధరించారని ఖాట్మండు లోయ పోలీస్ కార్యాలయం పేర్కొంది. ఆందోళనల్లో తీవ్రంగా నష్టపోయిన సుప్రీంకోర్టు, బ్యాంకులు కూడా దశలవారీగా తమ కార్యకలాపాలను పునరుద్ధరిస్తాయని అధికారులు చెప్పారు. చాలా చోట్ల కర్ఫ్యూను సడలించారు.

ఎలక్ట్రిక్ బస్సు పాలసీని మార్చండి ఆర్‌టిసిలనూ అనుమతించండి

- కేంద్రానికి ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి
- దేశవ్యాప్తంగా 'సేవ్ ఆర్‌టిసి' విజయవంతం

న్యూఢిల్లీ : ఎలక్ట్రిక్ బస్సు పాలసీని మార్చాలని కేంద్ర ప్రభుత్వానికి అఖిల భారత రోడ్డు రవాణా కార్మికుల సమాఖ్య (ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్) శుక్రవారం విజ్ఞప్తి చేసింది. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు- నిర్వహణ - ఆపరేషన్‌ను ప్రైవేటు ఆపరేటర్లకు అప్పగించే బదులు రాష్ట్రాల్లోని ఆర్‌టిసిలకు అప్పగించాలని కోరింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. వివిధ రాష్ట్రాల్లోని ఆర్‌టిసి కార్మికులు శుక్రవారం 'సేవ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్స్'ను నిర్వహించిన సందర్భంగా ఈ ప్రకటన విడుదల చేసింది. ఈ కార్యక్రమం విజయవంతం చేసి, భారీ సంఖ్యలో పాల్గొన్న కార్మికులకు సమాఖ్య అభినందనలు తెలిపింది. ఎఫ్ఎఎంఇ-1, ఎఫ్ఎఎంఇ-2, పిఎం ఇ-బస్ సేవా వంటి పథకాల కింద 'ఇ-మొబిలిటీ' పేరుతో ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు కేంద్రం ఒత్తిడి తీసుకొస్తుందని, పిఎం ఇ-బస్ సేవ కిందే పది వేల బస్సులకు రూ.20 వేల కోట్లు కేటాయించిందని తెలిపింది. పథకంలో బస్సుల కొనుగోలు- నిర్వహణ -ఆపరేషన్‌ను ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేసి, సబ్సిడీని పొందుతున్నారని తెలిపింది. ఆర్‌టిసిలను విస్మరిస్తూ ప్రైవేటు వ్యక్తులను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ఈ విధానాన్ని వెంటనే మార్చాలని డిమాండ్ చేసింది.

నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైన కార్మికులు

ప్రభుత్వ రవాణాను రక్షించాలనే పిలుపుతో దేశవ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన 'సేవ్ ఆర్‌టిసి' దినోత్సవం విజయవంతమైందని సమాఖ్య తెలిపింది. ఆర్‌టిసి కార్మికులకు మద్దతుగా వివిధ రాష్ట్రాలోని ప్రైవేటు రవాణా కార్మికులూ నిరసన ప్రదర్శనలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపింది.

మళ్లీ తెరపైకి నేవీ ఆయుధ డిపో

(మొదటిపేజీ తరువాయి)

ప్రయత్నించింది. 2024 అక్టోబర్ 28న గ్రామసభ నిర్వహించింది. దీనికి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కూడా హాజరయ్యారు. ఆయన సమక్షంలోనే గిరిజనులు ఆయుధ డిపోకు వ్యతిరేకంగా తీర్మానించారు. ఆయుధ డిపో ఏర్పాటు పట్ల ఎంపి మహేశ్‌కుమార్ చొరవ చూపడం పట్ల అప్పట్లో గిరిజనుల్లో ఆయనపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. దీంతో, ఎంపి స్పందిస్తూ, గిరిజనుల అభిప్రాయాన్ని గౌరవిస్తున్నామని, ఆయుధ డిపోపై వెనక్కి తగ్గుతున్నామని ఆ తర్వాత ప్రకటించారు. ఇప్పుడు ఆయన యూటర్న్ తీసుకొని అధికారులతో సమావేశం నిర్వహించడం పట్ల గిరిజనులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎక్కడికిపోవాలి

ఏలూరు జిల్లాలో పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాలు ఏజెన్సీ ప్రాంతాలుగా ఉన్నాయి. పోలవరం ప్రాజెక్టు పేరుతో పోలవరం మండలంలో 25కుపైగా గ్రామాల్లోని గిరిజనులను తరలించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని వందకుపైగా గ్రామాలను ఖాళీ చేయాల్సి ఉంటుంది. దీంతో, జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతం చాలావరకూ కనుమరుగవుతున్న పరిస్థితి ఉంది. నిర్వాసిత గిరిజనులను కొందరిని జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం మండలాలకే తరలించారు. మిగిలిన వారిని కూడా ఈ మండలాలకే తరలిస్తామని అధికారులు చెప్తున్నారు. ఇప్పుడు జీలుగుమిల్లి మండలంలో నేవీ డిపో ఏర్పాటు చేస్తే తాము ఎక్కడికిపోవాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయుధ డిపో ఏర్పాటైతే భూములను, ఉపాధిని కోల్పోతామని, గ్రామాలను ఖాళీ చేయాల్సి వస్తుందని, తాము ఎక్కడికిపోవాలని ఆందోళన చెందుతున్నారు. నావీ ఆంక్షలతో మండలంలో కూడా ప్రజల కదలికపైనా పరిమితులు విధిస్తారని వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే ఈ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇజ్రాయిల్ ప్రస్తావనే లేదు

- దోహాలో దాడులపై భద్రతా మండలి నామమాత్ర ఖండన

న్యూయార్క్ : ఖతార్ రాజధాని దోహాలో ఇజ్రాయిల్ ఇటీవల జరిపిన దాడులను ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఖండించింది. ఆ ఖండనలో అమానుషంగా దాడులు జరిపిన ఇజ్రాయిల్ పేరును ప్రస్తావించనే లేదు. ఇజ్రాయిల్ మిత్రపక్షమైన అమెరికాతోసహా 15 సభ్య దేశాలూ ఈ ప్రకటనపై సంతకాలు చేశాయి. చర్చల్లో పాల్గొంటున్న హమాస్ నేతలను హత్య చేయాలనే ఉద్దేశంతోనే మంగళవారం ఇజ్రాయిల్ ఈ దాడికి దిగింది. "భద్రతా మండలి సభ్యులు ఉద్రిక్తతలను తగ్గించాల్సిన ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. ఖతార్‌కు సంఘీభావం ప్రకటించారు. ఖతార్ సార్వభౌమాధికారానికి, ప్రాదేశిక సమగ్రతకు మద్దతు తెలియచేశారు." అని మండలి ప్రకటనలో పేర్కొంది. ఈ ఖండన ప్రకటనను బ్రిటన్, ఫ్రాన్స్‌లు రూపొందించాయి. గాజాలో కాల్పుల విరమణ కోసం చర్చలు జరుపుతున్న బృందాలకు కతార్ మధ్యవర్తిత్వం వహిస్తున్న నేపథ్యంలో దోహా కాల్పుల ఘటనపై ఖండనలు వెల్లువెత్తాయి. "హమాస్ చేతుల్లో మరణించిన వారితో సహా బందీలను విడుదల చేయాలని మండలి సభ్యులు అన్నారు. యుద్ధాన్ని ముగించి, గాజాలోని ప్రజల ఇబ్బందులను పరిష్కరించడం మండలి ప్రథమ ప్రాధాన్యత" అని భద్రతా మండలి ప్రకటన పేర్కొంది.

ఖండించడానికి ఇన్ని పరిమితులా? : అల్జీరియా అసంతృప్తి

భద్రతా మండలి ప్రకటన అనేక పరిమితులకు లోబడి ఉందని అల్జీరియా అసంతృప్తి వ్యక్తం చేసింది. "హింస, హింసకే కారణమవుతుంది. ఎలాంటి శిక్ష లేకపోవడం యుద్ధాన్ని రగిలిస్తుంది. అంతర్జాతీయ సమాజం ముఖ్యంగా ఈ భద్రతా మండలి మౌనంగా వుండడం గందరగోళ పరిస్థితులు పెచ్చరిల్లడానికి ఆజ్యం పోస్తుంది." అని అల్జీరియా రాయబారి అమర్ బెండ్‌జామా మండలిలో వ్యాఖ్యానించారు. ఈ మండలి చాలా పరిమితులకు లోబడి ప్రకటన చేసింది. కనీసం దాడులకు దిగిన దేశం పేరును కూడా ప్రస్తావించలేకపోయింది. ఈ దూకుడును అంతర్జాతీయ చట్ట ఉల్లంఘనగా కూడా ప్రకటించలేకపోయింది." అని అల్జీరియా స్పష్టం చేసింది. పాకిస్తాన్ కూడా ఇజ్రాయిల్ వైఖరిని ప్రశ్నించింది. శాంతికి గల ప్రతి అవకాశాన్ని చెడగొట్టాలన్నదే వారి ఆలోచనగా వుందని పాక్ రాయబారి అన్నారు.

శాంతి యత్నాలకు విఘాతం కలిగించేందుకే : ఖతార్

గాజాలో యుద్ధాన్ని అంతమొందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను పక్కదారి పట్టించడానికి ఇజ్రాయిల్ ప్రయత్నిస్తోందని ఖతార్ ప్రధాని షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్ రహాన్ అల్ తాని విమర్శించారు. అందుకే దోహాలో హమాస్ నేతలపై దాడులకు దిగారని, ఇంత జరిగినా తమ మధ్యవర్తిత్వ ప్రయత్నాలను కొనసాగిస్తామని ప్రతిన చేశారు. భద్రతా మండలిలో ఆయన మాట్లాడుతూ "చర్చలతో మేం తలమునకలై వున్న సమయంలో మా భూభాగాలపై దాడులు చేయడం వల్ల ఇజ్రాయిల్ ఉద్దేశమేంటో వెల్లడైంది. శాంతి ప్రయత్నాలను దెబ్బతీయాలన్నదే వారి లక్ష్యంగా వుంది. పాలస్తీనా ప్రజల కష్టాలు, ఇబ్బందులను శాశ్వతంగా కొనసాగించాలన్నది వారి ప్రణాళికగా ఉంది." అని అన్నారు. ఇజ్రాయిల్‌ను పాలిస్తున్న తీవ్రవాదులకు బందీల గురించి పట్టడం లేదని, వారిని కాపాడాలన్న ప్రాధాన్యతే అక్కడి పాలకులకు లేదని విమర్శించారు.

భారత ఐటినే లక్ష్యం

- కొత్త చట్టానికి ట్రంప్ ప్రతిపాదన

వాషింగ్టన్ : ట్రంప్ సర్కార్ భారత ఐటి రంగం లక్ష్యంగా మరో కొత్త చట్టానికి పదును పెడుతోంది. ఈ చట్టంతో అమెరికాలో సేవల్ని అందిస్తున్న భారత ఐటి సంస్థలు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని ఐటి సంస్థలు ఆందోళన చెందుతున్నాయి. సెనేటర్ బెర్నీ మోరెనో గత వారం ప్రతిపాదించిన హోల్టింగ్ ఇంటర్నే షనల్ రిలోకేషన్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ (హెచ్ఐఆర్ఎ) చట్టం ఆమోదం పొందితే అమెరి కన్ కంపెనీలు విదేశీ కార్మికులను నియమించవని భారత ఐటి నిపుణులు హెచ్చరిస్తున్నారు..

హెచ్ఐఆర్ఎ చట్టం అంటే ?

హోల్టింగ్ ఇంటర్నేషనల్ రిలోకేషన్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ (హెచ్ఐఆర్ఎ) చట్టం అమెరి కన్లకు ప్రయోజనం చేకూరేలా రూపొందించింది. ఆ దేశ కంపెనీలు విదేశాలకు అవుట్‌సోర్స్ చేస్తున్న పనిని తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకుంది. విదేశీ ఉద్యోగులకు చేసే చెల్లింపులపై 25 శాతం ఎక్సైజ్ పన్నును విధించాలని ఈ చట్టం ప్రతిపాదిస్తుంది. కంపెనీలు ఈ చెల్లింపులను ట్యాక్స్ డిడక్షన్‌లో చూపించే హక్కును కోల్పోతాయి.

భారత ఐటి రంగానికి ముప్పు

283 బిలియన్ డాలర్ల విలువ కలిగిన భారత ఐటి పరిశ్రమ అనేక అమెరికన్ కంపెనీలకు అవుట్‌సోర్సింగ్ సేవల్ని అందిస్తోంది. ఇందులో ఆపిల్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్, సిస్కో, సిటి గ్రూప్, హోడిపోట్ వంటి సంస్థలున్నాయి. ఈ చట్టం ఆమోదం పొంది అమల్లోకి వస్తే అమెరికన్ కంపెనీల అవుట్‌సోర్సింగ్ విధానాలను మారు స్తాయి.. ఇప్పటికే క్లయింట్లు కొన్ని ఒప్పందాలను ఆలస్యం చేస్తున్నారని లేదా పునరాలోచన చేస్తు నట్లు తెలుస్తోంది. అవుట్‌సోర్సింగ్‌కు 60 శాతం వరకు పన్ను భారం పడొచ్చు అని నిపుణులు అంచనా వేస్తున్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణకు రాష్ట్రవ్యాప్త పోరాటం

(మొదటిపేజీ తరువాయి)

పొడుస్తున్నాయన్నారు. విశాఖ ఉక్కుకు క్యాపిటివ్ మైన్స్ కేటాయించాలని కార్మికులు ఎప్పటి నుంచో పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. విశాఖ ఉక్కును మూసివేసి మిట్టల్ ఉక్కు ఫ్యాక్టరీని ప్రమోట్ చేసే పనిలో కూటమి నాయకులు ఉన్నారన్నారు. దీనికోసం ఎంత ముడుపులు తీసుకున్నారని ప్రశ్నించారు. కార్మికులపై టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు చేసిన వాఖ్యలను తప్పుబట్టారు. 3 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను, 1,400 మంది పర్మినెంట్ కార్మికులను ఇప్పటికే తొలగించారన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చేపట్టే కార్యక్రమాలకు పూర్తి మద్దతును ప్రకటించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ, విద్యా, వైద్యం, విశాఖ స్టీల్ అన్ని ప్రైవేటు పరం చేసుకుంటూ పోతే ప్రభుత్వం దేనికని ప్రశ్నించారు. అంబానీ, అదానీ, మిట్టల్‌కు ప్రజల సంపదను దోచిపెట్టేందుకు కుట్ర జరుగుతుందన్నారు. భవిష్యత్తులో సిఎం చంద్రబాబు ఈ సంస్థలకు పెద్ద జీతగాడుగా మారతారని తెలిపారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు చేపట్టే పోరాటం 26 జిల్లాల్లోను పెద్ద ఎత్తున నిర్వహించాలని, ఈ పోరాటానికి సిపిఐ మద్ధతు ఉంటుందని తెలియజేశారు.

వైసిపి నాయకులు బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు అంశాన్ని వచ్చే శాసన సభ సమావేశాల్లో లేవనెత్తుతామని చెప్పారు. ఉద్యమంలో కమిటీ వెంట నడుస్తామన్నారు. పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఈ విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. చంద్రబాబు అన్ని రంగాలను ప్రైవేటు పరం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వై.ఎస్ షర్మిల మాట్లాడుతూ.. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో పోరాట కమిటీకి రాసిన లేఖకు చంద్రబాబునాయుడు కట్టుబడి ఉండాలన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. సిపిఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) నాయకులు పి.ప్రసాద్ మాట్లాడుతూ.. విశాఖ ఉక్కులో 34 విభాగాలకు ఇఒఐ ప్రకటన జారీ చేయడాన్ని వ్యతిరేకించారు. ఈ సమావేశంలో ఎస్‌యుసిఐ రాష్ట్ర నాయకులు సురేష్, మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. విశాఖ ఉక్కు పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, ఎం.రాజశేఖర్, వైసిపి రాష్ట్ర నాయకులు పి.గౌతమ్ రెడ్డి, గాజువాక నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి తిప్పల దేవన్, సిపిఐ నాయకులు అక్కినేని వనజ, విశాఖ ఉక్కు పోరాట కమిటీ నాయకులు, పలు ప్రజా సంఘాల నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



జీవన సౌరభం

ప్రశ్నించనిదే సమాధానం దొరకదు. ప్రయత్నించనిదే విజయమూ దక్కదు.

మీ కోసం

కూరల్లో, పులుసుల్లో, ఉప్పు, కారం ఎక్కువైనప్పుడు రెండు చెంచాలు వేయించిన శనగపిండిని కలిపితే కూర రుచికరంగా ఉంటుంది.



వీపు విమానం మోత



సాయంత్రం నాలుగు గంటలయింది. బడి నుంచి వస్తూనే పుస్తకాల సంచి వీధి గుమ్మంలో పడేసి సీతాకోక చిలుక వెంటపడ్డాడు జున్నుబాబు.

అది గమనించిన కాశీతాత 'తప్పు! వాటిని బాధ పెట్టకూడదు' అని చెప్పి మనవడిని ఇంట్లోకి తీసుకొచ్చాడు. 'తాతా నీకో విషయం చెప్పాలి' అన్నాడు జున్ను బాబు. 'చెప్పు!' అన్నాడు తాతయ్య.

'ఈ రోజు శనివారం. నో బ్యాగ్ డే. ఈ రోజంతా ఆటలు, పాటలు, కథలు, కబుర్లతో గడపడమే తాతయ్యా' అన్నాడు మనవడు.

'నేను ఊరు, పేరు, కలర్ కలర్ వాట్ కలర్ ఆటలు ఆడాను. కథ చెప్పమన్నారు. మొన్న నువ్వు చెప్పిన 'మెదడుకు మేత' కథ చెప్పాను. ఆ పొడుపు కథని ఎవ్వరూ విప్పలేకపోయారు తాతయ్యా. నేను కథ చెప్తున్నంతసేపు కాత్యాయని, రుద్ర మాట్లాడుతూనే ఉన్నారు. వాళ్ళని చూసిన నరేష్ మాస్టారికి చాలా కోపం వచ్చింది. ఇద్దరినీ నిలబెట్టారు

'ఎవరైనా మాట్లాడితే 'వీపు విమానం మోత మోగుతుంది' శ్రద్ధగా కథ వినండి' అన్నారు. అందరూ నోటి మీద వేలు వేసుకుని కూర్చున్నారు. బడి వదిలిన తరువాత 'వీపు విమానం మోత' అంటే ఏమిటని నా స్నేహితులనందరినీ అడిగాను. ఎవ్వరికీ తెలియదన్నారు. 'మరి నిశ్శబ్దంగా ఎందుకు ఉన్నారు?' అని అడిగాను. 'మాట్లాడితే కొడతారని భయపడి అలా ఉన్నాము' అని చెప్పారు.

'వీపు విమానం మోత' అంటే ఏంటో నువ్వైనా చెప్పవా తాతయ్యా?' అని అడిగాడు జున్నుబాబు. 'విమానం ప్రయాణించేటప్పుడు, గాల్లోకి ఎగిరేటప్పుడు, కిందికి దిగేటప్పుడు పెద్ద శబ్దం వస్తుంది. ఆ శబ్దాన్ని భరించలేక మనం చెవులు మూసుకుంటాం. ఆ శబ్దం అంత పెద్దగా ఉంటుందో, అంత శబ్దం వచ్చేలా గట్టిగా కొడతాను సుమా! అని పిల్లల్ని హెచ్చరించే సందర్భంలో ఈ సామెత వాడుతున్నారు' అని చెప్పాడు తాతయ్య. 'వీపు విమానం మోత బాగుంది తాతయ్యా' అంటూ తాత ఒళ్ళోకి చేరాడు మనవడు.


- కాశీ విశ్వనాథం పట్రాయుడు, 94945 24445.

తేడాలు గుర్తించండి

పిల్లలూ! ఈ చిత్రంలో ఐదు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.



నేను గీసిన బొమ్మ





బడే హైమవతి
8వ తరగతి,
జెడ్‌పిహెచ్ ముత్యాలపేట,
కవిటి మండలం,
శ్రీకాకుళం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

బహుముఖ కథకుడు

మానవత్వమే మహాశయంగా.. తెలుగు సినీ చరిత్రలో ఎందరో పాటలు, మాటల రచయితలు సత్తాను చాటుకున్నారు. మట్టి పరిమళం, మనిషిదనం, మానవీయ విలువలను ఆవిష్కరిస్తూ ... మనసుకు హత్తుకునేలా కథలు రాసేవారూ ఉన్నారు. అలాంటి కథకుల్లో మేలిమి కథకుడు చింతకింది శ్రీనివాసరావు. జర్నలిస్టుగా, మానవీయ కథనాల రచయితగా, కథా, నవల, నాటక ప్రక్రియల్లో చేయి తిరిగిన సృజనశీలిగా పేరొందిన ఆయన .. ఇప్పుడు సినీసీమలోనూ తన సత్తా చాటుతున్నారు.



అనకాపల్లి జిల్లా చోడవరానికి చెందిన చింతకింది నాగేశ్వరరావు, సీతమ్మ దంపతుల కుమారుడే శ్రీనివాసరావు. కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలి సభ్యులుగా ఉన్న ఆయన తెలుగుతోపాటుగా మిగతా భాషల్లో సాహిత్యం, సినిమా, కళలు మరింతగా విస్తృతి చెందేలా కృషి చేస్తున్నారు. తండ్రి చోడవరం ప్రభుత్వ కళాశాలలో సంస్కృత ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఎంఏ తెలుగు, పీహెచ్‌డీ చేసిన శ్రీనివాసరావు వత్తిగా పత్రికా రచనను ఎంచుకున్నారు. కథ, నవల, నాటకం, సినిమా, మానవీయ కథనాల రచన, పరిశోధకులుగా కొనసాగుతున్నారు. మూడు దశాబ్దాలకుపైగా ప్రముఖ దినపత్రికల్లో స్టాఫ్ రిపోర్టర్ నుంచి ఎడిటర్ స్థాయి వరకూ ఎదిగారు. విశాఖ మాండలికం గుబాళించే కథలు రాశారు. నానీలపై పరిశోధన చేసి, డాక్టరేట్ పట్టా పొందారు. ఇప్పుడు టాలీవుడ్‌లో సరికొత్త కథలతో తనదైన ప్రత్యేక బాణీలో ముందుకు సాగుతున్నారు.

కళింగాంధ్ర మాండలిక సౌరభం శ్రీనివాసరావు రచనలు సరళమైన భాషలో సాగుతూ ఉత్తరాంధ్ర పలుకుబడి సౌరభాలను వెదజల్లుతుంటాయి. కళింగాంధ్ర మాండలికాన్ని రచనల ద్వారా వ్యాప్తి చేసిన ఘనత ఆయనకు దక్కుతుంది. మన చుట్టూ జరుగుతున్న ఘటనలను, యథార్థమైన విషయాలను ఎంచుకుని కథలు రాయటంలో ఆయన దిట్ట. 80కిపైగా కథలు రాశారు. వికర్ణ, అదిగో ద్వారక, బుగతల నాటి చుక్కపల్లి, పూలగండువనం, మున్నీటి గీతలు నవలలు రచించారు. పది వరకూ నాటికలు, నాలుగు నాటకాలు ఆయన కలం నుంచి వెలువడ్డాయి. సాహితీ రంగంలో క్రియాశీలకంగా ఉండటం, ఏళ్ల తరబడి కథలు, నవలు రాస్తుండటంతో వెండితెరకు పరిచయమయ్యారు చింతకింది. ఆయన రచనలు దర్శకుడు క్రిష్‌కు నచ్చటంతో తెలుగు సినీ రంగానికి చేరువ చేశారు. చింతకింద రాసిన 'మున్నీటి గీతలు' నవల ఉత్తరాంధ్ర జాలర్ల నేపథ్యంలో నడుస్తుంది. సినీ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి పర్యవేక్షణలో 'అరేబియా కడలి' అనే విజయవంతమైన వెబ్‌సిరీస్‌గా అమెజాన్ ప్రైమ్‌లో ఓటీటీ కోసం మలిచారు. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటించిన 'హరిహర వీరమల్లు' సినిమాకు మాటల విభాగంలో చింతకింది రచయితగా పనిచేశారు.



ఇటీవల విడుదలైన 'ఘాటీ' చిత్రం తూర్పు కనుమల్లో.. ప్రధానంగా ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దుల నేపథ్యంలో సాగుతుంది. ఇక్కడ 'శీలావతి' అనే అరుదైన గంజాయి లభ్యమవుతుంది. గిరిజనులు ఈ కొండలన్నీ సులభంగా ఎక్కి దిగుతూ ఎక్కడికి కావాలంటే అక్కడికి చేరుకుంటారు. 100 నుంచి 150 కేజీల బరువులను ఇట్టే మోసేస్తారు. ఈ పూర్వరంగంలో సాగే కథ కాబట్టి ఘాటీ అని నామకరణం చేశారు. సమాజానికి చేటు చేస్తున్న గంజాయిని సామాజిక సమస్యగానే చూడాలని, దాన్ని నేరంగా, శాంతిభద్రతల సమస్యగా చూసినంతకాలం పరిష్కారం లభించదని ఘాటీ చిత్ర కథా రచయితగా చింతకింది భావన. గిరి రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు అందించటం, వారికి అక్షర జ్ఞానాన్ని కల్పించటం తదితర అంశాలపై దృష్టి సారించాలనేది ఆయన మాట. సినిమా కథల్లో ఉత్తమ కవితా ప్రమాణాలకు చింతకింది పెద్దపీట వేస్తున్నారు. ఆయన కథల్లో సామాజిక పరిస్థితుల పట్ల స్పష్టమైన అవగాహన.. సమస్యను దగ్గర నుంచి లోతుల్లోకి చూసే వైనం.. సమస్యను పట్టిచూపే మానవీయకోణం కనిపిస్తాయి. కథనంలో చమత్కారాలు, వ్యంగ్యోక్తులు ఆయన విశిష్టత. సందర్భోచితమైన సంభాషణలు అవలీలగా రాస్తుంటారు. చింతకింది నాటకాలు, చిత్రాలు ఇందుకు నిలువెత్తు నిదర్శనం.

కథా వస్తువు, వైవిధ్యం, సందర్భశుద్ధికి తగ్గ వర్ణనలు, పాత్రల్లో జీవం ఉట్టిపడేలా.. వాటిలో హావభావాలు పలికేలా.. పొందికైన పదాల అమరికతో చింతకింది వాక్యాలు కదులుతుంటాయి. ఆయన కలం నుంచి మరిన్ని మంచి కథలు, సంభాషణలు నాటకాల్లోనూ, నవలల్లోనూ, చిత్రాల్లోనూ మనల్ని పలకరిస్తాయని ఆశిద్దాం.


- యడవల్లి శ్రీనివాసరావు

అనేక పురస్కారాలు

చింతకింద శ్రీనివాసరావు సాహిత్య కృషికి అనేక అవార్డులూ రివార్డులూ లభించాయి.

- భరతముని సాహిత్య పురస్కారం
- తిరుపతి జాతీయ కళాపురస్కారం
- చాసో పురస్కారం
- కెఎన్‌వై పతంజలి సాహిత్య పురస్కారం
- రావిశాస్త్రి స్మారక సాహిత్య పురస్కారం
- ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి త్రిపురనేని గోపీచంద్ పరిశోధనా బంగారు పతకం
- రాష్ట్రప్రభుత్వం ద్వారా ఉగాది పురస్కారం
- గిడుగు రామ్మూర్తి భాషా పురస్కారం
- ఢిల్లీ తెలుగు అకాడమీ అవార్డు
- సోమనాథ కళాపీఠం (పాలకుర్తి) సాహితీ పురస్కారం
- బాలల నాటిక 'ఎక్కడి వాళ్లక్కడే'కు బంగారునంది
- గర్భగుడి నాటిక రచయితగా రాష్ట్రప్రభుత్వ నంది పురస్కారం
- కొలకలూరి విశ్రాంతమ్మ స్మారక నవలా పురస్కారం
- మున్నీటి గీతలు నవలకు తానా బహుమతి
- సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం

సామాజిక అంశాలకు ప్రాధాన్యం



సినిమా అనేది చాలా బలమైన మాధ్యమం. ప్రజల జీవితాలపై పెను ప్రభావాన్ని చూపుతుంది. మానవీయ కోణంలో విలువల పెంపుదల కోసం నా వంతుగా కృషిచేస్తా. సామాజిక స్వభావంలో మార్పు వస్తేనే ప్రజా సమూహం ప్రగతిపథంలో పయనిస్తుంది. మనిషి కేంద్రంగా నడిచే సమాజం మానవత్వంతో వ్యవహరించినప్పుడే సత్ఫలితాలు లభిస్తాయి. వాస్తవితకు అద్దం పెట్టేలా నా రచనలు ఉండేలా చూస్తున్నా. మంచి కథా, సినిమా రచయితగా సమాజ పురోగతికి దోహదపడే అంశాలకు ప్రాధాన్యత ఇస్తా.

- చింతకింది శ్రీనివాసరావు, సినిమా కథా రచయిత

సమానత్వ భావనే ఇతివృత్తంగా...



'సమాజంలోని మనుషులంతా ఒక్కటే. పేద, ధనిక అనే బేధం ఉండకూడదు. కులం, మతం ప్రస్తావనే అసలు వద్దు. మానవత్వంతో అందరం మెలుగుదాం. నేటి సమాజంలో ఇలాంటి సందేశం యువతకు తెలియజేయాలనేది మా సంకల్పం. అందుకే ఇలాంటి కథను ఎత్తుకుని సినిమాను తెరకెక్కించాం. అనుకున్న ప్రకారం నిర్ణీత సమయంలోనే సినిమాను పూర్తిచేశాం. సమాజానికి మంచి సందేశం ఇవ్వాలనేది మా ఉద్దేశ్యం. ఇందులో నటీనటులంతా ఎంతో మనసు పెట్టి చక్కగా చేశారు. అందరికీ శుభాభినందనలు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి' అని దర్శకుడు సిద్ధార్థ వర్మ కాకాని అన్నారు. కథానాయకుడు వినయ్ తేజ్, కథానాయికగా రిషిత తొలి పరిచయంగా తెరకెక్కిన సినిమా 'చౌదరి గారి అమ్మాయి'. ఎల్లో టకోమా ప్రొడక్షన్ బ్యానర్‌లో ఎడ్‌కాన్ ఫ్లస్ సంస్థ దీనిని నిర్మించింది.

మరిన్ని మంచి కథలతో ముందుకొస్తా : అనుష్క




'సోషల్ మీడియాకు దూరంగా ఉండాలనుకుంటున్నా. ఎప్పుడూ స్క్రోలింగ్ చేసే లైఫ్‌కు దూరంగా.. నిజమైన ప్రపంచానికి దగ్గరగా ఉండాలని నిర్ణయించుకున్నా. త్వరలోనే మరిన్ని మంచి కథలతో మరింత ప్రేమతో మీ ముందుకు వస్తాను. నా సినిమాలను ఆదరించిన, ఆదరిస్తున్న ప్రేక్షకులకు అభినందనలు. నేను కొన్ని రోజులుగా ఎక్కడికీ వెళ్లడం లేదు. వచ్చే ఏడాది నుంచి వరుస సినిమాలు చేస్తా' అని సినీ కథానాయిక అనుష్క తన లేఖలో పేర్కొన్నారు. కొన్నేళ్లుగా మీడియాకు దూరంగా ఉంటోన్న ఆమె తాజాగా సోషల్ మీడియాకు కూడా దూరంగా ఉండనున్నట్లు ప్రకటించారు. సోషల్ మీడియాకు కొంతకాలం బ్రేక్ ఇస్తున్నట్లు తెలుపుతూ ఒక లెటర్‌ను పోస్ట్ చేశారు. ఇటీవల 'ఘాటి' ప్రచారంలోనూ ఆమె పరోక్షంగా పాల్గొన్నారు. రానా, అల్లు అర్జున్‌లతో ఫోన్‌లో మాట్లాడి సినిమా విశేషాలతో పాటు కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.



అక్టోబర్ 23న 'రాజాసాబ్' ఫస్ట్‌సాంగ్

అక్టోబర్ 2న విడుదలయ్యే 'కాంతార: చాప్టర్-1' సినిమాతో 'రాజాసాబ్' ట్రైలర్‌ను విడుదల చేస్తామని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ తెలిపారు. ప్రభాస్ బర్త్‌డే సందర్భంగా అదే నెల 23న ఫస్ట్‌సాంగ్‌ను రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 9న థియేటర్లలోకి రానుంది. తమన్ సంగీతం అందిస్తున్నారు. విశ్వప్రసాద్ నిర్మించిన 'మిరాయ్' శుక్రవారం విడుదలైన విషయం తెలిసిందే.



సందేశాత్మక చిత్రాలనూ ఆదరించండి

'సినిమా చిన్నదా? పెద్దదా? అని చూడకండి. అందులో కథనం.. కథాగమనం బాగుందా? లేదా? అనేది మాత్రమే చూడండి. మంచి సినిమాలను ఆదరించండి. సందేశాత్మక చిత్రాలను ప్రోత్సహించండి. ఏదో ఒక ఇతివృత్తంతోనే సినిమాల్లో కథలు ఉంటాయి. సమాజ రుగ్మతలను పట్టిచూపిన సినిమా 'స్పిరిట్' (ఈజ్ నాట్ వన్). కథ విన్నాక మంచి సందేశాత్మక చిత్రంగా ఉంటుందనే నమ్మకం ఏర్పడింది. అందుకే ఈ సినిమాను ఆదరించాలని కోరుతున్నా. గ్రామీణ ప్రాంతానికి చెందిన చెన్నెబోయిన నర్సమ్మ ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డారు. ఆమె త్యాగం ఫలించాలి. ప్రేక్షకులు ఆదరించాలి' అని సినీ కథానాయిక లయ కోరారు. 8త్ వండర్ సినిమా బ్యానర్‌పై 'స్పిరిట్ (ఈజ్ నాట్ వన్)' సినిమాను సిహెచ్ వెంకట రవీంద్రనాథ్ ఎంఎస్ దర్శకత్వంలో తెరకెక్కించారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా చిత్ర బృందంతో లయ మాట్లాడి అభినందించారు.

సెమీస్‌కు లక్ష్యసేన్

- క్వార్టర్స్‌లో ఆయుష్‌పై సాధికార విజయం
- సాత్విక్, చిరాగ్ జోడీ సైతం ముందంజ
- హాంగ్‌కాంగ్ ఓపెన్ సూపర్



హాంగ్‌కాంగ్ : ఈ ఏడాది వరుస టోర్నమెంట్లలో నిరాశపరిచిన భారత స్టార్ షట్లర్, పారిస్ ఒలింపిక్స్ సెమీఫైనలిస్ట్ లక్ష్యసేన్ హాంగ్‌కాంగ్ ఓపెన్‌లో సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. బిడబ్ల్యూఎఫ్ సూపర్ 500 టోర్నమెంట్‌లో సెమీఫైనల్లో అడుగుపెట్టిన లక్ష్యసేన్.. సహచర షట్లర్ ఆయుష్ శెట్టిపై సాధికారిక విజయం సాధించాడు. పురుషుల సింగిల్స్‌లో శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో 21-16, 17-21, 21-13తో లక్ష్యసేన్ పైచేయి సాధించాడు. 66 నిమిషాల పాటు ఉత్కంఠగ సాగిన మ్యాచ్‌లో తొలి గేమ్‌లో నెగ్గిన లక్ష్యసేన్.. ఆయుష్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. కీలక రెండో గేమ్‌ను గెల్చుకున్న ఆయుష్.. మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లాడు. డిసైడర్‌లో 9-9 వరకు నువ్వా నేనా అన్నట్టు సాగిన మ్యాచ్‌ను లక్ష్యసేన్ చేతుల్లోకి తీసుకున్నాడు. 11-9తో విరామ సమయానికి ముందంజ వేసిన లక్ష్యసేన్.. 16-13 తర్వాత వరుస పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. 21-13తో మూడో గేమ్‌తో పాటు సెమీఫైనల్ బెర్త్‌ను కైవసం చేసుకున్నాడు. ప్రీ క్వార్టర్స్‌లో ఐదో సీడ్ కొడాయ్ నరొకపై గెలుపొందిన ఆయుష్ శెట్టి.. క్వార్టర్స్‌లో లక్ష్యసేన్ ముంగిట తలొగ్గాడు. భారత షట్లర్లు ప్రణయ్, ఆయుష్‌లపై విజయాలతో లక్ష్యసేన్ సెమీస్‌లో అడుగుపెట్టాడు.

పురుషుల డబుల్స్‌లో వరల్డ్ నం.9 జోడీ సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టిలు సైతం సెమీఫైనల్లో కాలుమోపారు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో మలేషియా షట్లర్లు జునైది, రాయ్ కింగ్‌లపై 21-14, 20-22, 21-16తో గంటకు పైగా సాగిన మ్యాచ్‌లో విజయం సాధించారు. తొలి గేమ్ నెగ్గిన సాత్విక్ జోడీ.. రెండో గేమ్‌ను టైబ్రేకర్‌లో చేజార్చుకున్నారు. నిర్ణయాత్మక మూడో గేమ్‌ను స్పష్టమైన ఆధిక్యంతో సొంతం చేసుకుని సెమీస్ బెర్త్ బుక్ చేసుకున్నారు. నేడు జరిగే పురుషుల సింగిల్స్‌లో మూడో సీడ్ చైనీస్ తైపీ షట్లర్ చో చెన్‌తో లక్ష్యసేన్ ఆడనుండగా.. అన్‌సీడెడ్ చైనీస్ తైపీ జోడీ చెన్, లిన్‌లతో సాత్విక్, చిరాగ్‌లు పోటీపడనున్నారు.

మీనాక్షి పతక పంచ్



లివర్‌పూల్ (ఇంగ్లాండ్): వరల్డ్ బాక్సింగ్ (డబ్ల్యూబీ) ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో భారత్ నాల్గో పతకం ఖాయం చేసుకుంది. మహిళల 48 కేజీల విభాగంలో మీనాక్షి 5-0తో ఇంగ్లాండ్ బాక్సర్ అలైస్‌పై ఏకపక్ష విజయం సాధించింది. మూడు రౌండ్లలో ఇంగ్లాండ్ బాక్సర్‌పై పిడి గుద్దుల వర్షం కురిపించిన మీనాక్షి.. ఐదుగురు రిఫరీల ఏకగ్రీవ విజేతగా నిలిచింది. ఈ విభాగంలో సెమీఫైనల్స్‌కు చేరుకుని పతకం ఖాయం చేసుకుంది. మహిళల 80+ కేజీల విభాగంలో నుపుర్, 57 కేజీల విభాగంలో జైస్మిన్ లాంబోరియ, 80 కేజీల విభాగంలో పూజ రాణి సెమీఫైనల్స్‌కు చేరుకుని కనీసం కాంస్య పతకం ఖాయం చేసిన సంగతి తెలిసిందే. ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో హ్యాట్రిక్ పసిడి పతకమే లక్ష్యంగా లివర్‌పూల్‌కు వచ్చిన భారత స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ మహిళల 51 కేజీల విభాగం క్వార్టర్‌ఫైనల్లో అనూహ్య పరాజయం చవిచూసిన సంగతి తెలిసిందే.

పాటిదార్, రాథోడ్ సెంచరీలు

సెంట్రల్ జోన్ 384/5 • దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లో సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతను సంపాదించింది. సౌత్‌జోన్‌తో జరుగుతున్న ఫైనల్లో సెంట్రల్ జోన్ కెప్టెన్ రజత్ పాటిదర్(101), యశ్ రాథోడ్(137నాటౌట్) సెంచరీలతో రాణించారు. మరోవైపు సరాన్ష్ జైన్(47నాటౌట్) కూడా బ్యాటింగ్‌లో రాణించడంతో సెంట్రల్ జోన్ జట్టు 104 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 384పరుగులు చేసింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో సౌత్‌జోన్‌ను కేవలం 149పరుగులకే పరిమితం చేసిన సెంట్రల్ జోన్.. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో భారీస్కోర్ దిశగా దూసుకెళ్తోంది. సెంట్రల్ జోన్ జట్టు ఇప్పటికే 235పరుగుల ఆధిక్యతను సంపాదించింది. సౌత్‌జోన్ బౌలర్లు గుర్‌ప్రీత్ సింగ్‌కు మూడు, నితీశ్, కౌశిక్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

గురి కుదరలేదు!

- ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్

నింగ్బో (చైనా) : ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత్‌కు నిరాశ తప్పలేదు. తుది అంచె పోటీల్లో భారత షూటర్లు ఏ విభాగంలోనూ ఫైనల్స్‌కు చేరుకోలేదు. శుక్రవారం జరిగిన మహిళల 50 మీటర్ల రైఫిల్ 2 పొజిషన్స్ విభాగంలో భారత షూటర్లు ఫైనల్‌కు అర్హత సాధించలేదు. ప్రపంచ చాంపియన్‌షిప్స్ కాంస్య పతక విజేత మెహులీ ఘోష్ అర్హత రౌండ్‌లో 583 పాయింట్లు సాధించి 23వ స్థానం, మానిణి ఖౌషి అర్హత రౌండ్లో 580 పాయింట్లు స్కోరు చేసి 45వ స్థానంలో నిలిచారు. సురభి భరద్వాజ్ 578 పాయింట్లతో 52వ స్థానానికి పరిమితమైంది.

ఫైనల్‌కు చేరాలని..!

జపాన్‌తో భారత్ ఢీ నేడు మహిళల హాకీ ఆసియా కప్



గాంగ్జు (చైనా) : మహిళల హాకీ ఆసియా కప్‌లో టీమ్ ఇండియా నేడు కఠిన పరీక్షకు సిద్ధమవుతోంది. సూపర్4 దశలో దక్షిణ కొరియాపై 4-2తో నెగ్గిన భారత అమ్మాయిలు.. ఆతిథ్య చైనా చేతిలో 1-4తో పరాజయం పాలయ్యారు. టాప్-2లో నిలిచిన జట్లు మాత్రమే ఫైనల్‌కు చేరనుండగా.. సూపర్4 దశ ఆఖరు మ్యాచ్‌లో నేడు జపాన్‌తో భారత్ తలపడనుంది. జపాన్ తొలి మ్యాచ్‌ను 1-1తో దక్షిణ కొరియాతో డ్రా చేసుకుంది. చైనా చేతిలో 0-2తో ఓటమి చెందింది. రెండు విజయాలతో చైనా ఫైనల్‌కు అర్హత సాధించగా.. మరో బెర్త్ కోసం భారత్, జపాన్, దక్షిణ కొరియా పోటీపడుతున్నాయి. గ్రూప్ దశలో జపాన్‌తో 2-2తో డ్రా చేసుకున్న భారత్.. నేడు కీలక మ్యాచ్‌ను డ్రా చేసుకున్నా ఫైనల్‌కు చేరుకునే వీలుంది. మరో మ్యాచ్‌లో చైనాతో దక్షిణ కొరియా తలపడనుంది. భారత్ నుంచి ముంతాజ్ ఖాన్, నేహా, లాల్‌రెమిసియామి, నవనీత్ కౌర్, ఉదిత, షర్మిళ, రుతుజలు నేడు కీలకం కానున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68